

ఓం నమఃశివాయ...



- కొండలపై కొలువుదీరిన శైవక్షేత్రాలు
- భక్తుల కొంగుబంగారం మల్లేశ్వరుడు
- నేడు మహాశివరాత్రి.. ఏర్పాట్లు పూర్తి
- ఆలయాలకు పోటెత్తనున్న భక్తులు

మదనపల్లె, మార్చి 7: శివనామస్మరణతో శైవక్షేత్రాలన్నీ మార్మోగనున్నాయి. శుక్రవారం శివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. ఇప్పటికే ఆయా ఆలయాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో కొండలపై కొలువుదీరిన మహిమ గల మల్లేశ్వరస్వామి ఆలయాలు భక్తుల కొంగు బంగారంగా బాసిల్లుతున్నాయి. చోళరాజుల కాలంలో వెలసిన ఈ శైవక్షేత్రాలు ఒకదానికి మించి మరొక కొండలపై కొలువై ఉన్నాయి. ఈ సన్నిధానాలు గురువారం నాటికి మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. జిల్లాతో పాటు సమీపంలోని జిల్లా, రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకునే ఈ ఆలయాలను నిర్వాహకులు పెద్దఎత్తున సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇక్కడికి పెద్దఎత్తున తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం నీటి, భోజన వసతి, రవాణా సౌకర్యాలు కూడా కల్పించారు. డివిజన్ కేంద్రమైన మదనపల్లె నుంచి అన్ని శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు నడుపుతోంది. ముఖ్యంగా తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి, మదనపల్లె మండలం వేంపల్లె మల్లయ్య కొండపై వెలసిన మల్లికార్జునస్వామి, కురబలకోట మండలం అంగళ్లు సమీపంలోని అఖండ మల్లికార్జునస్వామి, రామసముద్రం మండలంలోని వాలీశ్వరస్వామి ఆలయాలను పరమ శివభక్తులైన చోళరాజులు ఒకే వరుసలో కొండలపై ఆలయాలను నిర్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ నాలుగు ఆలయాల్లో ఒకదానికి మించి మరొకటి ఘనమైన చరిత్ర, విశిష్టతను సంతరించుకున్నాయి.

కొండపై మల్లేశ్వరుని మహిమ



మల్లయ్యకొండ ఆలయంలో ప్రత్యేక పూలు, పండ్లతో అలంకరణ

తంబళ్లపల్లె మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జున స్వామి ఆలయాన్ని చోళరాజుల కాలంలో శ్రీకృష్ణదేవరాయలు నిర్మించారు. యల్లయ్య భక్తుడు పశువులు కాచే సమయంలో ఆకాశం నుంచి పడిన కిరణం పడిన చోట పుట్ట నుంచి వచ్చిన నాగుపాము నాట్యమాడిందని స్థానికంగా ప్రచారంలో ఉంది. దీంతో శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన దిగ్గజాలు భూమిని తవ్వగా, శివలింగం ప్రత్యక్షం కావడంతో గుడి నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆలయం గర్భగుడిలోని శివలింగాన్ని సూర్యకిరణాలు తాకుతుండటంతో భక్తులకు అపారనమ్మకం పెరిగింది. శివుడి సోదరి వెలుగుమల్లమ్మ అన్నపై అలకబూని ఆలయ కింది భాగంలో ఆగిపోగా అక్కడ వెలుగు మల్లమ్మ పేరుతో ఆలయం నిర్మించారని, శివుడు సోదరిని బుజ్జగించే క్రమంలో కొండపైకి వచ్చే భక్తులు ముందుగా సోదరిని దర్శించుకున్నాకే తనను దర్శించుకుంటారని ప్రచారంలో ఉంది. అలాగే స్వామి వారి సతీమణి గౌరమ్మ కూడా ఓ దశలో అలకబూని ఆలయం దిగువ ప్రాంతంలో ఆగిపోవడంతో బుజ్జగించేందుకు వెళ్లిన స్వామి వారూ మధ్యలో ఆగిపోయి వెనక్కి వచ్చేసినట్లు చెబుతున్నారు. ఈ క్రమంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో ఊరేగించే రథం కూడా మధ్యభాగానికి వెళ్లి నిలిచిపోగా, తర్వాత వేలమంది లాగినా రథం ముందుకెళ్లలేదనే నానుడి ప్రచారంలో ఉంది. కోరినకోర్కెలు తీర్చే దేవుడిగా భావిస్తూ మహిళలు సంతానం కోసం వరపడుతుంటారు. స్వామి ప్రతిరూపాలుగా చెబుతున్న మల్లయ్యధారులు మాఘమాసం నుంచే గ్రామాల్లో శివనామస్మరణతో భిక్షాటన చేయడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం ఇక్కడ సుమారు రూ.6 కోట్ల వ్యయంతో ఆలయ పునరుద్ధరణ, కొండపైకి ఇది వరకే తారురోడ్డు పనులు చేపట్టారు.



ప్రత్యేక అలంకరణలో అఖండ మల్లేశ్వరుడు

ఏకశిల రాతి శివాలయం..వేంపల్లె మల్లయ్యకొండ

మదనపల్లె మండలం వేంపల్లె పంచాయతీలోని మల్లయ్యకొండపై వెలసిన మల్లికార్జునస్వామి ఆలయం ఏకశిలరాతి ఆలయంగా ప్రసిద్ధి చెందింది.



వేంపల్లె మల్లయ్యకొండపై నిర్మించిన ఏకశిల రాతి ఆలయం

అన్ని శైవక్షేత్రాల్లో ఆలయ నిర్మాణంలో భాగంగా సామగ్రిని కొండ కింద ప్రాంతం నుంచి సమకూర్చుకుంటే, ఇక్కడి ఆలయానికి మాత్రం కొండపైనే బండను తొలచి తీసిన రాతిస్తంభాలతో ఆలయాన్ని నిర్మించిన ఆనవాళ్లు ఉన్నాయి. ఇక్కడ బండలు తీయగా ఏర్పడిన గుంతను కోనేరుగా ఏర్పాటు చేయడం ప్రత్యేకంగా చెప్పవచ్చు. 1622లో మదనపల్లెను పాలించే అహోబిలనాయుడు ఈ ఆలయానికి మాన్యాన్ని ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. కొండకు దిగువనున్న జంగాలపల్లెలోని జంగమదేవర్లు మొదట్లో ఆలయంలో పూజలు చేసేవారని నానుడి. జంగమదేవర్లున్న ఈ గ్రామాన్ని ప్రస్తుతం జంగాలపల్లెగా పిలుస్తున్నారు. కొండపై ఉన్న ఆలయం తరహాలోనే ఈ గ్రామంలోనూ అదే తరహాలో అదే నమూనాతో ఆలయం నిర్మించి పూజలు చేస్తున్నారు. ఇక్కడ మొదటి పూజ చేసిన అనంతరమే వారు కొండపై మల్లికార్జునస్వామికి పూజలు చేసేవారని స్థానికులు చెబుతున్నారు. సముద్రమట్టానికి 3600 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఆలయ నిర్మాణం శిఖరాగ్రంపై పెద్దరాతి బండపై పునాదులు లేకుండా నిర్మించారు. అంతేకాకుండా ఈ ఆలయ నిర్మాణానికి ఒకే రాతి నుంచి వెలికి తీసిన బండలు, కూసాలు, దూలాలతో నిర్మించడం విశేషం. దీనికి ప్రతిగా రాతిబండపై కోనేరు కూడా ఉంది.

రామసముద్రంలో దేవరకొండ వాలీశ్వరుడు



రామసముద్రం మండలం ఆర్.నడింపల్లె పంచాయతీ దేవరకొండలో వెలసిన వాలీశ్వరుడికి మహిమాన్వితుడనే పేరుంది. శివభక్తుడైన వాలీ దేవరకొండపై ప్రకృతి అందాలకు ముగ్ధుడై అక్కడే సేద తీరినట్లు చెబుతుంటారు. ఈ క్రమంలో స్నానం చేసి వెంట తెచ్చిన శివలింగానికి పూజలు చేసి, కిష్కింధకు బయలుదేరే క్రమంలో ఆయన శివలింగాన్ని ఎత్తబోగా శివలింగం కదలదు. దీంతో ఆ ప్రాంత మహిమను గుర్తించి, అక్కడే లింగ ప్రతిష్ఠ జరిపి కిష్కింధకు వెళ్లిపోయినట్లు పురాణాలు చెబుతున్నాయి. అప్పటి నుంచి దేవరకొండ లాలీశ్వరకొండగా ప్రసిద్ధి చెందింది. వాలీశ్వరకొండలో స్వామిపాదాల చెంత ఉద్భవించిన అంతరగంగ కోనేరు ఓ అద్భుతమని భక్తులు చెబుతుంటారు. ఎంతకరువు వచ్చినా ఎండిపోకపోవడం దీని ప్రత్యేకత. ఈ నీరు రెండు పాయలుగా చీలి కౌండిన్యనదిగా ప్రవహిస్తోందని స్థల పురాణం చెబుతోంది. ఇక్కడి వాలీశ్వరుని దర్శనానికి సమీపంలోని కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. గిరిజా కల్యాణంతోపాటు స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించనున్నారు.

కోరిన కోర్కెలు తీర్చే అఖండ మల్లేశ్వరుడు



కురబలకోట మండలం అంగళ్లు సమీపంలో మల్లయ్యకొండపై వెలసిన అఖండ మల్లేశ్వరుడు భక్తులు కోరిన కోర్కెలను తీర్చే దేవుడిగా ప్రసిద్ధి చెందారు. చోళరాజులు ఈ ప్రాంతంలో పర్యటించినప్పుడు పరమశివుడు సూచనల మేరకు చోళరాజులు ఆలయం నిర్మాణం చేపట్టినట్లు పురాణాలు చెబుతున్నాయి. అంగళ్లు సమీపంలోని మల్లయ్య కొండ రోజురోజుకి అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ ప్రతినిత్యం పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేకంగా పూజలు చేస్తుంటారు. ఏటా మాఘమాసం బహుళ త్రయోదశిలో ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇక్కడ నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ, సుబ్రహ్మణ్యం స్వామి, పార్వతి ఉత్సవ మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

భక్తుల కల్పతరువు...కలకడ సిద్ధేశ్వరుడు

కలకడ, మార్చి 7: సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేతా సిద్ధేశ్వరస్వామి భక్తుల కల్పతరువుగా పేరుగాంచారు. జిల్లాలోని ప్రముఖశైవ క్షేత్రాల్లో ఒకటైన సిద్ధేశ్వరాలయాన్ని 13వ శతాబ్దంలో నిర్మించినట్లు తెలుస్తోంది. సుమారు 800 సంవత్సరాల చరిత్ర గల ఈ ఆలయాన్ని వైదుంబరాజులు నిర్మించినట్లు ఆధారాలు ఉన్నాయి. భక్తుల కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ప్రసిద్ధిగాంచిన సిద్ధేశ్వరస్వామి ఆలయ స్థల పురాణం మేరకు ఒక ఆసక్తికరమైన కథ ప్రచారంలో ఉంది. కడప జిల్లా సిద్దవటం మండలాన్ని పాలించిన చంద్రగుప్త మహారాజు గారాలపట్టి సత్యవతి కన్య జీవితానికి ఆలయ నిర్మాణానికి అవినాభావ సంబంధం ఉందని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఎన్నో వ్రతాలు, పూజల ఫలితంగా లేక లేక పుట్టిన ఆడబిడ్డ యుక్తవయసు రాగానే కన్యగా గర్భం ధరించడంతో రాజు తలవంపులకు కారణమవుతుంది. దీంతో నిండు సభలో తన కుమార్తెను దోషిగా నిలిపి న్యాయకోవిదుల తీర్పును అర్థిస్తారు. ఈ సందర్భంగా సత్యవతి తలపై ఒక సర్పాన్ని చుట్టగా పెట్టి, దానిపై కల్లు పోసిన కడవను ఉంచి ఏడు పొలిమేర్ల దూరం నడిపించాలని, కడవ పగలకుండా, కల్లు కింద పడకుండా నిర్దేశిత దూరాన్ని పూర్తి చేసి తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని, లేకుంటే అక్కడికక్కడే శిరచ్ఛేదం చేయాలని న్యాయ పండితులు ఆదేశించినట్లు కథ ప్రచారంలో ఉంది. అదే విధంగా భటులు వెంటరాగా బయలుదేరిన సత్యవతి శేషాచల కొండల మీదుగా కాలినడకన ఏడు పొలిమేరలు దాటి కలకడ వద్ద ఉన్న నదిని చేరగానే గర్భం మాయమై కడవలో శివలింగం ఉద్భవించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. తన ప్రాతివ్రత్యాన్ని నిరూపించుకున్న అనంతరం జీవితంపై విరక్తి చెందిన ఆమె తూర్పు దిక్కుగా కొంత దూరం వెళ్లి అంతర్ధానమైందని అంటారు. సత్యవతి అడుగిడిన నదికి సత్యవతి నది అని, కల్లు కడవలో శివలింగం పుట్టినందున కల్లుఘట, కాలక్రమేణా కలకట, కలకడ అని రూపాంతరం చెందిందని స్థల పురాణం వల్ల తెలుస్తోంది. ఇలా ఉద్భవించిన శివలింగాన్ని వైదుంబరాజులు ప్రతిష్ఠించి ఆలయాన్ని నిర్మించారని అంటారు. కాగా శివరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. మహాశివరాత్రి రోజు రాత్రి జాగరణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ షామియానాలు ఏర్పాటు చేశారు.



ఆలయంలోని శివలింగం

సర్వపాపహరణం...ఝురి స్నానం

సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షీ సమేత సిద్ధేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి మరుసటి రోజు జరిగే ఝురి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. కలకడకు తూర్పు దిక్కున దాదాపు 6 కిలోమీటర్ల దూరంలో సత్యవతి, బాహుదా నదుల సంగమంతో ఏర్పడే ఝురిలో మునిగితే సర్వపాపాలు హరించుకుపోయి పుణ్యం దక్కుతుందని భక్తుల విశ్వాసం. మహాశివరాత్రి జాగరణను పూర్తి చేసుకున్న భక్తులు వేకువ జామునుంచే ఝురికి చేరుకుని పుణ్యస్నానాలాచరిస్తారు. రాయలసీమ జిల్లాల నుంచే కాక హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర నగరాల నుంచి వేలాదిగా తరలివచ్చే భక్తులతో ఝురి ప్రాంతం కిక్కిరిసిపోతుంది. ఝురి ఉత్సవాల్లో పాల్గొనే భక్తులు సౌకర్యార్థం పీలేరు, మదనపల్లె డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతారు.

భక్తులు స్నానాలు చేసే ఝురి సంగమం



సకల పాపహరణం.. హత్యరాల పుణ్యక్షేత్రం

రాజంపేట, మార్చి 7 : ఉమ్మడి కడప జిల్లాలో మహాపుణ్యక్షేత్రాల్లో ఒక్కటిగా రాజంపేట మండలం హత్యరాలలోని కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి దేవస్థానం దివ్యక్షేత్రంగా అలరారుతోంది. హత్యరాలలోని మడుగు త్రేతాయుగం నుంచి సర్వపాపాలకు సకలపాపహరిణిగా గుర్తింపు పొందింది. ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆలయం కావడంతో ఈ ఆలయానికి భక్తులు దర్శనం కోసం శివరాత్రి పర్వదినం రోజు లక్షలాది మంది ఆలయంలో రాత్రి జాగారం చేసి మడుగు పుణ్యస్నానమాచరించి అనంతరం స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఆలయంలో పరుశురాముడు ప్రత్యేకంగా పూజలు చేసినట్లు పూర్వీకులు చెబుతున్నారు. పరుశురాముడు తండ్రి ఆజ్ఞ మేరకు తల్లిని వధిస్తాడు. తల్లిని హత్య చేసిన ఆనవాళ్లు అతడి శరీరంపై ఉండటంతో అనేక పుణ్యనదుల్లో స్నానమాచరించినా, ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించినా ఆ శరీరంపై ఉన్న రక్తపు మరకలు పోకపోవడంతో హత్యరాల ఆలయానికి చేరుకుని బాహుదానదిలో పుణ్యస్నానాలు ఆచరించడంతో ఆనవాళ్లు కనుమరుగైపోవడంతో ఈ క్షేత్రాన్ని హత్యరాలగా పిలుస్తున్నారు. పాపవిమోచనం చేసిన గ్రామానికి హత్యరాలగా పేరు వచ్చిందని చరిత్రకారులు చెబుతున్నారు. హత్యరాలను అత్తిరాలగా కూడా పిలుస్తారు.


ఘనంగా త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు : త్రేతేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మార్చి 4వ తేదీ నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలు 12వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 10 గంటలకు కపాలేశ్వర ఉత్సవం, సాయంత్రం 5 గంటలకు శిఖరదీపారాధన, రాత్రి లింగార్చన, అనంతరం లింగోద్భవం, 9వ తేదీ ఉదయం 9 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం పెళ్లికొడుకు గుర్రపు వాహనం, రాత్రి 11 గంటలకు ఏనుగు వాహనం, 10వ తేదీ ఉదయం బ్రహ్మరథోత్సవం, 11వ తేదీ తోటోత్సవం, 12వ తేదీ పిగిలికుంటుత్సవం, రాత్రి 8 గంటలకు ధ్వజావరోణ కార్యక్రమాలు జరగనున్నాయి. అలాగే ప్రతిరోజూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



ఆలయం ముందు వేసిన చలువ పందిళ్లు

శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు : మహాశివరాత్రి సందర్భంగా రాజంపేట, కోడూరు నియోజకవర్గాల్లోని ప్రముఖ శైవక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ జి.రమణయ్య తెలియజేశారు. శైవక్షేత్రాలకు మొత్తం 35 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. హత్యరాలకు 20 బస్సులు, వై.కోట గుండాలకోనకు 10 బస్సులు, తలకోనకు 10 బస్సులు ప్రత్యేకంగా నడుస్తాయన్నారు.

శాంతిభద్రతలు పర్యవేక్షించిన డీఎస్పీ : హత్యరాలలో డీఎస్పీ చైతన్య ఆధ్వర్యలో రాజంపేట సీఐలు మద్దయ్య ఆచారి, మంజునాధరెడ్డి, రవికుమార్‌లు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. భక్తులు పుణ్యస్నానాలు చేసే ప్రాంతంలో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ చైతన్య మాట్లాడుతూ హత్యరాల పుణ్యక్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, స్వామి దర్శనానికి లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వారికి అన్ని విధాలా వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.





మడుగు వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు, త్రేతేశ్వరస్వామి మూలవిరాట్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

చేయూత పథకం చెక్కుల పంపిణీలో జేసీ ఫర్మాన్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 7: పేద మహిళల కోసం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడ నుంచి వైఎస్ఆర్ చేయూతను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 80,931 మంది మహిళలకు రూ.151.75 కోట్లు మహిళల ఖాతాల్లో జమ చేశారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వైఎస్ఆర్ చేయూత కార్యక్రమం ద్వారా 45 నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఈ డబ్బుతో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ మరింత అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం మెగా చెక్కును ముఖ్య అతిథుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.



మహిళలకు చెక్కు అందజేస్తున్న జేసీ, తదితరులు

ఎన్నికల్లో మీడియా పాత్ర అత్యంత కీలకం

ఎన్నికల సమగ్రత, పారదర్శకతకు మీడియా దోహదం చేస్తుంది : కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 7: ప్రజాస్వామ్యంలో ఎన్నికల సమగ్రత, పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపర్చడంలో మీడియా ఎంతో దోహదం చేస్తుందని, ఎన్నికల్లో మీడియా పాత్ర అత్యంత కీలకమని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. గురువారం రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎన్నికల్లో మీడియా పోషించాల్సిన పాత్రపై ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడప డీసీసీ బ్యాంక్ డీఆర్ ఓఎస్డీ గుర్రప్ప పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల్లో మీడియా నిర్వహించాల్సిన పాత్రపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పాత్రికేయులు ప్రజలకు సరైన సమాచారాన్ని అందించడంలో అత్యంత కీలకపాత్ర పోషించాలన్నారు. ఎన్నికల్లో వివిధ విభాగాల లాగానే మీడియా కూడా ఎన్నికల్లో ముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. ఎన్నికల్లో ప్రజలు పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయడానికి మీడియా సహకరించాలన్నారు. ఎన్నికల్లో అతి సున్నితమైన వాతావరణం ఏర్పడుతుందని వాస్తవ విషయాల కంటే అసత్యమైన విషయాలే త్వరగా వ్యాప్తి చెందుతాయన్నారు. ఫేక్ న్యూస్‌లను కాకుండా సత్యమైన, వాస్తవిక దృష్టితో వార్తలు ప్రసారం అయ్యేలా మీడియా ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని జిల్లా ఎన్నికల మీడియా కేంద్రం నుంచి ఐఅండ్‌పీఆర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు తెలియజేస్తామన్నారు. ఎన్నికల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో, చైతన్య పర్చడంలో పాత్రికేయులు సహకరించాలని కోరారు. కడప డీసీసీ బ్యాంక్ డీఆర్ ఓఎస్డీ గుర్రప్ప మాట్లాడుతూ రాజకీయ ప్రకటనలు, సోషల్ మీడియా, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సినిమా హాల్‌లో ప్రకటనలు, ఈ-పేపరు, రేడియోలలో ముందుగా ఎంసీఎంసీ ద్వారా ధ్రువీకరణ అయిన తర్వాతనే ప్రచురించాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి, ఎంసీఎంసీ మెంబర్ సెక్రటరీ భరత్‌కుమార్‌రెడ్డి, డీపీఆర్‌వో పురుషోత్తం, కేంద్ర ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి ధర్మానాయక్, జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, పాత్రికేయులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

అంతా బహిరంగమే...

పెనగలూరు మండలంలో ఇంటింటికీ వైసీపీ చీరల పంపిణీ

పెనగలూరు, మార్చి 7 : సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైసీపీ నాయకులు గ్రామాలలో బహిరంగంగానే చీరల పంపిణీ కార్యక్రమాన్ని తలపెట్టారు. గురువారం సాయంత్రం పెనగలూరు పంచాయతీలోని సాతపల్లి, సాతపల్లి హరిజనవాడ, ఇండ్లూరు హరిజనవాడల్లో చీరలు పంపిణీ చేశారు. ట్రాక్టర్‌లో 50 బస్తాలను వేసుకుని ఇంటింటికీ వెళ్లి వైసీపీ ముద్రించిన సంచుల్లో చీరలు అందజేశారు. కార్యక్రమంలో పెనగలూరు పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తున్న వ్యక్తి, చెత్త సేకరణ ట్రాక్టర్ డ్రైవర్, మరో ఇద్దరు వ్యక్తులు పంపిణీలో పాల్గొన్నారు. ట్రాక్టర్ యజమాని ట్రాక్టర్ వెనుకనే ఉంటూ ప్రతి ఇంటికీ చీరలు అందే విధంగా చర్యలు చేపట్టారు. వెలగచర్ల గ్రామంలోని ఒక దేవాలయం వద్ద చీరలను పెట్టుకుని గ్రామంలోని వారందరినీ అక్కడికి పిలిపించి ఇంటికొక చీర చొప్పున పంపిణీ చేసినట్లు తెలిసింది. పెనగలూరు, కొండూరు పంచాయతీలకే కాకుండా మండలంలోని ద్వితీయ శ్రేణి వైసీపీ నాయకులందరి వద్దకు చీరలు చేరినట్లు సమాచారం. వారందరూ రెండు రోజుల్లో మండల వ్యాప్తంగా పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



సాతుపల్లెలో వృద్ధురాలికి వైసీపీ బ్యాగులో ఉన్న చీర పంపిణీ చేస్తున్న దృశ్యం

డిగ్రీ మొదటి సెమిస్టరు ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వైస్‌చాన్సలర్, రిజిస్ట్రారు, ప్రిన్సిపల్ తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 7: వైవీయూ అనుబంధ కళాశాలల బీఏ, బీకాం, బీబీఏ, డీడీఏ, బీఎస్ హానర్స్ డిగ్రీ మొదటి సెమిస్టరు పరీక్ష ఫలితాలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్‌చాన్సలర్ తన ఛాంబరులో రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డితో కలిసి ఫలితాలు వెల్లడించారు. 2023 డిసెంబరులో జరిగిన ఈ పరీక్షలకు 6789 మంది విద్యార్థులు హాజరు కాగా 3970 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. 54 శాతం ఫలితాలు వచ్చాయని తెలిపారు. బీఏలో 45 శాతం, బీబీఏలో 47 శాతం, బీసీఏలో 70 శాతం, బీకాంలో 54 శాతం, బీఎస్సీలో 66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని స్పష్టం చేశారు.

మహిళలు అన్ని రంగాలలో ముందుండాలి



ఖోఖో పోటీలలో పాల్గొంటున్న విద్యార్థినులు

కడప (స్పోర్ట్స్), మార్చి 7: మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని నెహ్రూయువ కేంద్ర జిల్లా యువ అధికారి కె.మణికంఠ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నెహ్రూ యువ కేంద్ర, జేబీవీఎస్ ది ప్రజర్వేర్ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నారీ శక్తి ఫిట్నెస్, నారీశక్తి వాలీబాల్, నారీశక్తి ఖోఖో తదితర క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజ పురోగతికి మహిళలే కారణమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి, సమితి వ్యవ స్థాపకులు అశోక్, ఎన్‌వైకే వాలంటీర్లు, కాలేజి సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, జేబీవీఎస్ సంస్థ సభ్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కళాకారుడు మృతి



వివిధ వేషదారణలో రవికుమార్, మృతి చెందిన రవికుమార్ (ఫైల్)

మైదుకూరు, మార్చి 7: కాళికా నృత్యాలతో పాటు బృందావనంలో అఘోరా, కాంతార లాంటి విశేష ప్రజాధారణ పొందిన వేషాలు వేస్తూ పోటీలలో సరితూగిన కళాకారుడు మిరియాల రవికుమార్ (45) బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానిక కళాకారులకు నిలయమైన పార్వతీనగర్‌కు చెందిన రవికుమార్ పగటివేషాలు వేస్తూ జీవనం గడిపేవారు. బుధవారం మదనపల్లెలో ఓ కార్యక్రమం ముగించుకొని ద్విచక్రవాహనంలో తిరిగి మైదుకూరుకు తిరిగి వస్తుండగా రాయచోటి వద్ద కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రవికుమార్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కడప ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. కాగా రవికుమార్ వివిధ వేషాలు వేస్తూ అందరి మన్ననలు పొందారు. భార్య ముగ్గురు పిల్లలన్నారు. రవి కుమార్ మృతి పట్ల అభిమానులతో పాటు పార్వతినగర్‌లోని మిగిలిన కళాకారులు రోధనలో ఉండిపోయారు.

విద్యుత్ తీగలు తగిలి విద్యార్థికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన సింహాద్రి

బి.కోడూరు, మార్చి 7: ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలు తగలడంతో బత్తల సింహాద్రి అనే విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని తంగేడుపల్లెకు చెందిన బత్తల సిద్దయ్య కుమారుడు సింహాద్రి గురువారం తన అన్న మేకలను పొలాల్లో మేపుకుంటుండగా మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లాడు. ఆ సమయంలో గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాన్స్‌ఫార్మరు వద్ద తీగలు కింద పడి ఉండగా విద్యార్థి దాటే ప్రయత్నం చేయగా.. ప్రమాదవశాత్తు విద్యుత్ తగిలి శరీర భాగాలన్నీ కాలిపోయి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. కాగా, సింహాద్రి బద్వేలు ప్రభుత్వ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



పోలయ్య (ఫైల్)

నందలూరు, మార్చి 7: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన పోలయ్య (45) బుధవారం ఒంటిమిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆసరా డబ్బులు ఇప్పించండి..



ఏపీఎంను నిలదీస్తున్న మహిళలు

ఖాజీపేట, మార్చి 7: నెల రోజుల క్రితం ప్రభుత్వం ఆసరా 4వ విడత కింద విడు దల చేసిన డబ్బులు ఇప్పించాలని పత్తూరు డ్వాక్రామహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పత్తూరు గ్రామానికి చెందిన ఆరుడ్వాక్రా గ్రూపు సభ్యులు బ్యాంకు మేనేజర్ వద్దకు వెళ్లి ఆసరా డబ్బులు ఇవ్వాలని అడుగగా మేనేజర్ డబ్బులు ఇచ్చేది లేదని చెప్పడంతో ఆగ్రహించిన మహిళలు మండల సమాఖ్య కార్యాలయానికి వెళ్లి ఏపీఎం వెంకటరామరాజును నిలదీశారు. మేము డబ్బులు కట్టలేము, ఆనిమేటర్ సరిగా చెప్పడం లేదు, మేనేజర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని తెలిపారు. మేము నెలకు రూ.5 వేలు మాత్రమే చెల్లిస్తాం.. ఆ లోన్ తీరినంతవరకు మరో లోన్ వద్దని, ప్రస్తుతం ఉపాధి పనులు లేవని, ఎక్కువ డబ్బులు చెల్లించాలంటే మేము చెల్లించలేమన్నారు. మాకు ఆసరా డబ్బులు ఇప్పించాలన్నారు. ఇందుకు ఏపీఎం మాట్లాడుతూ బ్యాంకు మేనేజర్, గ్రూపు సభ్యులు, ఆనిమేటర్ కలిసి ఏమి తీర్మాణం చేశారో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డీబార్

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 7: ఇంటర్ పరీక్షల్లో ఒక విద్యార్థి డీబార్ అయినట్లు ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు గణితం, బాటనీ, సివిక్స్ పేపరు-2 పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 17603 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16777 మంది హాజరయ్యారు. 826 మంది గైర్హాజరయ్యారు. కడప నగరంలో ఓ కళాశాలలో విద్యార్థి చూసి రాత రాస్తుండగా పట్టుబడి డీబార్ అయినట్లు ఆర్ఐవో తెలిపారు.

పనులు చేయకుండానే... బిల్లులు చెల్లిస్తారా?

- కౌన్సిల్ సమావేశంలో తీవ్ర దుమారం
- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులకు జనరల్ ఫండ్స్ ఎలా కేటాయిస్తారు
- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు



కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

ఎర్రగుంట్ల, మార్చి 7: ఎర్రగుంట్ల నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. పనులు చేయకుండానే బిల్లులు ఎలా చెల్లిస్తారంటూ కొందరు, పాత బిల్లులకు ఇప్పుడు పేమెంట్స్ చెల్లించడమేంటని మరికొందరు ఫైర్ అయ్యారు. ఇందుకు తాము ససేమిరా ఒప్పుకోమని కౌన్సిలర్లు తెల్చి చెప్పారు. ఎర్రగుంట్ల నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం గురువారం చైర్మన్ ఎం.హర్షవర్దన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో అనేక అంశాలను కౌన్సిలర్లు వ్యతిరేకించారు. ముఖ్యంగా 2016-17లో ఎస్సీ సబ్ ప్లాన్ కింద రూ.4కోట్లు మంజూరు చేశారు. అయితే ఇందుకు సంబంధించి పనులు చేసినట్లు కొంతమేర బిల్లులు కూడా చెల్లించారని.. మిగతా బ్యాలెన్స్ మొత్తాన్ని నగర పంచాయతీ సాధారణ నిధుల నుంచి చెల్లించాలని అజెండాలో చేర్చారు. అయితే ఈ విషయాన్ని 6వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి మరికొందరు తీవ్రంగా వ్యతిరేకించారు. ఎప్పుడో చేసిన పనులకు ఇప్పుడు సాధారణ నిధుల నుంచి ఎందుకు చెల్లించాలని కమిషనర్‌ను ప్రశ్నించారు. అలాగే నీటి సరఫరాకు సంబంధించి లక్షలకు లక్షలు బిల్లు పెట్టారని.. దీనిపై అభ్యంతరాలున్నాయని మరికొందరు కౌన్సిలర్లు నిలదీశారు. డబ్బులు ఇప్పుడు చెల్లించమని.. కౌన్సిల్ రిజల్యూషన్ మాత్రమే కోరుతున్నామని కమిషనర్ రామక్రిష్ణ సమాధానం చెప్పడంతో కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మేము బిల్లులను పక్కన పెట్టమని చెబుతుంటే వీటిపై సీఆర్ ఎందుకని ఎదురుదాడికి దిగారు. దీనికి కో ఆప్షన్ సభ్యుడు డి.సూర్యనారాయణరెడ్డి కూడా బలపరచారు. పాత బిల్లులకు సంబంధించి ఒక్క రూపాయికూడా ప్రస్తుతం చెల్లించడానికి వీల్లేదని వారు తెల్చి చెప్పారు. తాము ఏ పనిచేయమని అడిగినా డబ్బుల్లేవని సమాధానం చెప్పే అధికారులకు సాధారణ నిధుల నుంచి ఎలా చెల్లిస్తారని ధ్వజమెత్తారు. తాము గత సమావేశంలో వ్యతిరేకించిన అంశాలను మీరే పాస్ చేసుకుంటారా అంటూ మండిపడ్డారు. ఇక మేమెందుకు.. మమ్మల్ని ఎందుకు పిలవడం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మమ్మల్ని ఆహ్వానించకుండా కించపరుస్తారా...

కౌన్సిల్ సమావేశానికి తమకు కనీసం ఆహ్వానం కూడా పంపడం లేదని కొందరు కౌన్సిలర్లు అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. దీంతో కమిషనర్ జూనియర్ అసిస్టెంట్‌ను ప్రశ్నించారు. తన వద్ద నున్న ఫోన్ నెంబర్లకు వాట్సాప్ పెట్టానని ఆయన సమాధానం చెప్పడంతో.. వాట్సప్‌ల్లో పిలిస్తే మేము రావాలా అంటూ కౌన్సిలర్లు నిలదీశారు. ఇక కౌన్సిల్‌లో కౌన్సిలర్ల బంధువులను సమావేశం జరిగేటప్పుడు లోపలికి కమిషనర్ అనుమతించారు. పైగా వారితో మాట్లాడించడంపై కొందరు కౌన్సిలర్లు మండిపడ్డారు. వచ్చే సమావేశానికి తాము కూడా తమ పరివారంతో వస్తామని... అప్పుడు అనుమతించకపోతే ఊరుకోమని హెచ్చరించారు.

పనులెక్కడ చేశారో చూపించండి సారూ....

2016-2017లో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన నిధుల నుంచి ప్రకాష్‌నగర్‌లో, శాంతినగర్‌లో సీసీ డ్రైన్లు పెట్టినట్లు అజెండాలో ఉంచారని.. అవి ఎక్కడ చేశారో చూపించాలని కౌన్సిలర్లు ప్రశ్నించారు. ప్రకాష్‌నగర్‌లో అసలు డ్రైన్ వేశారా... వేస్తే ఎక్కడుందో చూపించండని ఆ వార్డు ఇన్‌చార్జి ప్రశ్నించారు. అలాగే మరో చోట కూడా డ్రైన్ వేయకుండా బిల్లులు పెట్టారన్న విమర్శలపై కోఆప్షన్ సభ్యులు మండిపడ్డారు. దీనిపై విజిలెన్స్ ఎంక్వైరీ చేయాలని మరికొందరు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.

ఎన్నికల విధుల్లో సమన్వయంతో పనిచేయాలి

- అన్నమయ్య జిల్లా ఎస్పీ క్రిష్ణారావు



కేంద్ర పోలీసు దళాలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, మార్చి 7: రానున్న సార్వత్రిక ఎన్నికల సార్వత్రిక ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర పోలీసు దళాలు, జిల్లా పోలీసులు సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ క్రిష్ణారావు పేర్కొన్నారు. కేంద్ర పోలీసు దళాలు జిల్లాకు వచ్చిన సందర్భంగా ఎస్పీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర పోలీసు దళాలు, పోలీసు అధికారులకు, సార్వత్రిక ఎన్నికల విధుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా భౌగోళిక పరిస్థితులు, అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు, పోలీసు సబ్‌డివిజన్లు గురించి విపులంగా తెలియజేశారు. ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అధికారులు, సిబ్బంది అత్యంత పారదర్శకంగా, నిష్పక్ష పాతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఎన్నికల సమయంలో పాటించాల్సిన నియమాలు గురించి అవగాహన కల్పించారు.

వైభవోపేతం వీరభద్రుడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవం

- మూడో రోజు ఘనంగా నవగ్రహ హోమం



యాళి వాహనంపై ఊరేగుతున్న భద్రకాళీ సమేత వీరభద్రుడు

రాయచోటిటౌన్, మార్చి 7: రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం మూడవ రోజు ఉదయం నవగ్రహ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్‌పర్సన్ పోలంరెడ్డి విజయమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ దశరథరామిరెడ్డి, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్ఛారణల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వీరభద్రుడు, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి యాలివాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ వారిచే నిర్వహించిన చెక్కభజన కార్యక్రమం భక్తులను అలరించింది. అలాగే రాత్రికి భద్రకాళీ సమేత వీరభద్రుడు సింహవాహనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. వాహన ఊరేగింపు సందర్భంగా వీరభద్రస్వామి భజన మండలి తుమ్మల హరినాధ ఆధ్వర్యంలో కోలాటం, వాసవీ వనిత వారిచే చేపట్టిన కోలాటం భక్తులకు ఆకట్టుకుంది. పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

74 మద్యం బాటిళ్లు స్వాధీనం



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

ప్రొద్దుటూరు, మార్చి 7: పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను గురువారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్టు చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన శ్రీనివాసరెడ్డి, చంద్రమోహన్ అనే వ్యక్తులు పాండిచ్చేరి నుంచి మద్యం అక్రమంగా తీసుకు వస్తుండగా ప్రొద్దుటూరులోని ఓ సర్కిల్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 74 ఫుల్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం రవాణాచేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఈబీ సీఐ మహేష్ కుమార్ తెలిపారు.

35 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొండాపురం ,మార్చి 7: పట్టణంలో 35 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొర్రపాడు గ్రామానికి చెందిన ఆవుల సుబ్బరాయుడు అనే వ్యక్తి 35 మద్యం బాటిళ్లను అనుమతి లేకుండా తీసుకెళుతుండగా కొండాపురం బస్టాండులో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎఎస్సై నరసింహులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నందలూరు, మార్చి 7: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో నాగిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ భగత్‌సింగ్ కాలనీకి చెందిన నాగలూరు నాగేంద్రకు రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి కోలార్‌లత గురువారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. అతన్ని రాజంపేట సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల సామూహిక దహనం



చంపిన కుక్కలను సామూహిక దహనం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, మార్చి 7: కొత్తపల్లె పంచాయితీలోని మండి మర్చంట్ ఏరియాలో కొందరు కుక్కలను చంపి సామూహిక దహనం చేశారు. గురువారం ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. గత రెండు రోజులుగా కొందరు కుక్కలను చంపి ఈ ప్రాంతంలో కుప్పగా వేసి గురువారం దహనం చేసినట్లు ఆప్రాంత వాసులు తెలిపారు. అయితే ఈ కుక్కలను పంచాయతీ అదికారులే పట్టుకుని చంపారా లేదా మరెవరైనా చంపారా అనేది తెలియడం లేదు. పంచాయతీ కార్యదర్శి నరసింహులుకు ఫోన్ చేస్తే ఆయన ఫోన్ స్విచ్ ఆఫ్‌లో వుంది. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డికి ఫోన్ చేసి వివరణ అడగగా తాము కుక్కలను పట్టలేదని.. వాటిని ఎవ్వరు చంపారో తెలియదని వివరణ ఇచ్చారు. ఏదేమైనా ఈ అమానుష ఘటనకు కారకులెవ్వరో పంచాయతీ అధికారులు, పోలీసులు విచారణ చేపట్టి చట్ట పరంగా శిక్షించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

విద్యుత్ వైరు చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

కొండాపురం ,మార్చి 7: మండలంలో ముంపునకు గురైన పాత తాళ్లప్రొద్దుటూరు ప్రాంతంలో విద్యుత్ వైరు చోరీ కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. అనిల్, మనోహర్‌తో పాటు మరో వ్యక్తి కలిసి విద్యుత్‌స్తంభాల వైరు చోరికి పాల్పడినట్లు ఎలక్ట్రికల్ ఏఈ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గరిపై కేసు నమోదు చేయగా, ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు



ఎస్ఐ చంద్రమోహన్‌తో మాట్లాడుతున్న రైతులు

వీరబల్లి, మార్చి 7: మా ప్రాంతం నుంచి ఇసుకను తరలించవద్దంటూ గురువారం మాండవ్య నదిలోని పుల్లగూర గండి వద్ద మండల రైతులు ప్రతిమ కంపెనీ సిబ్బందిని అడ్డుకున్నారు. ఇక్కడి నుంచి ఇసుకను తరలిస్తే ఒప్పుకునే ప్రసక్తే లేదని ఇసుక రీచ్ ఏర్పాటు కోసం వచ్చిన కంపెనీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడికి విచ్చేసిన పోలీసు సిబ్బందిపై కూడా మండిపడ్డారు. అనంతరం పలువురు నాయకులు అక్కడికి చేరుకొని అధికారులతో మాట్లాడారు. మా ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తే భూగర్భ జలాలు అడుగంటిపోయి తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వాల్టా చట్టం ప్రకారం మాండవ్యనదిలో నుంచి ఇసుకను తరలించడం సాధ్యమైన పని కాదని ప్రతిమ సంస్థ సిబ్బందికి తెలిపారు. మండల నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకోవడంతో ఎస్ఐ చంద్రమోహన్ వారితో చర్చించి ఎలాంటి సమస్య తలెత్తకుండా సర్దుబాటు చేశారు. కార్యక్రమంలో బాబురెడ్డి, వీఆర్‌డీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మండల టీడీపీ బీసీ నాయకులు తుమ్మల రమేశ్, ఆంజనేయులురెడ్డి, తారకేశ్వర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

14న వైవీయూలో సీతాకోక చిలుకలపై జాతీయ కార్యశాల

కడప (ఎర్రముక్కపల్లె), మార్చి 7: వైవీయూలో జంతుశాస్త్ర విభాగం అసిస్టెంటు ప్రొఫెసరు వెంకటరమణ ఆధ్వర్యంలో ఈనెల 14న సీతాకోక చిలుకలపై జాతీయ వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించిన బ్రోచర్‌ను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి విడుదల చేశారు. ఈసందర్భంగా చింతా సుధాకర్ మాట్లాడుతూ సీతాకోక చిలుకలపై జాతీయ సదస్సు నిర్వహించడం రెండు తెలుగు రాష్ట్రా ల్లో ఇదే మొదటిది అన్నారు. సదస్సును విజయవంతంగా నిర్వహించాలని కమిటీకి సూచించారు. కార్యక్రమంలో టీడీసీ డీన్ ప్రొఫెసరు రఘుబాబు, కార్యశాల కన్వీనరు వెంకటరమణ, జంతు శాస్త్ర విభాగం విభాగాధిపతి రామిరెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఉర్దూ పాఠశాలల పనివేళల్లో మార్పులు

రామాపురం, మార్చి7: రంజాన్ మాసం సందర్భంగా ఈ నెల 11వ తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఉర్దూ పాఠశాలల పనివేళలు మార్చినట్లు పీయూటీఎస్ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ సయ్యద్ మజహరుల్‌హక్ తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన వివరించారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల డైట్ కళాశాలలో ఒంటి పూట బడి నిర్వహణకు అనుమతించారన్నారు.

మత్స్యకార సొసైటీ ఎన్నికలు వాయిదా

పెనగలూరు, మార్చి7 : పెనగలూరు కన్యకల చెరువు మత్స్యకార సొసైటీ ఎన్నికలు గురువారం జరగాల్సి ఉండగా సభ్యుల అభ్యంతరంతో వాయిదా పడినట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి సుబ్బనరసయ్య తెలిపారు. గతంలో ఈ ఎన్నికలు చేతులెత్తే పద్దతి ద్వారా జరుగుతుండేవన్నారు. బ్యాలెట్ పత్రాలను ఉపయోగించి రహస్య ఓ టింగ్ పద్ధతిలో నిర్వహించాలని ఇద్దరు వ్యక్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, ఆయన ఆదేశాల మేరకు ఈ ఎన్నికలు వాయిదా పడినట్లు ఆయన తెలిపారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

పుల్లంపేట, మార్చి7: మండలంలోని 315 మందికి స్థానిక ఎంపీడీవో సభాభవనంలో గురువారం ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. తహశీల్దారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ ప్రారంభం

రామాపురం, మార్చి7: ప్రయాణికుల సౌకర్యార్థం రామాపురంలో రూ.18 లక్షల ఎంపీ ల్యాడ్స్ నిధులతో నిర్మించిన ఆర్టీసీ బస్‌షెల్టర్‌ను గురువారం ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. బస్‌షెల్టర్‌లో మౌలిక వసతులతో పాటు టాయిలెట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



వ్యవస్థలో స్త్రీ భాగస్వామ్యం తప్పనిసరి


ఉపాధ్యాయురాలికి జ్ఞాపిక అందజేస్తున్న యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నేతలు


రైల్వేకోడూరు: మాట్లాడుతున్న జడ్జి అంజనీప్రియదర్శిని

రాజంపేట టౌన్, మార్చి7 : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో స్త్రీభాగస్వామ్యం అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీ భాగస్వామ్యంతో సమాజం అభివృద్ధి పదంలో కొనసాగుతోందన్నారు. మహిళలకు సరైన అవకాశాలను కల్పిస్తే అద్భుతాలు సృష్టిసారన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, రాష్ట్ర కౌన్సిలర్ చంగల్ రాజు, ఎస్ ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, ఉపాధ్యాయులు లక్షుమ్మ, ఆదిలక్ష్మి, సుమలత, గోవిందమ్మ, సరిత, హైమావతి, భారతి, ఉపాధ్యాయులు రమణ య్య, హమీద్, ప్రసాద్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని మాస్టర్ ట్రైనర్ పూర్ణిమ, గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కే. పార్థసారథి తెలిపారు. గురువారం రైల్వేకోడూరు గిరిజా లేన్ లోని గ్లోబల్ ట్రైనింగ్ సెంటర్‌లో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. టైలరింగ్, మగ్గం వర్క్ ట్రైనర్లు గంగాదేవి, పాళెంకోట పద్మావతి, మాస్టర్ ట్రైనర్ తనూజ, రాజేశ్వరి, భావన తదితర మహిళలు పాల్గొన్నారు. రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై. నాగరాజనాయుడు మాటాడుతూ మహిళలు అనేక రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏసీ కో-ఆర్డినేటర్ జీ. దయానందం, ఉమెన్ ఎంపవర్‌మెంట్ మెంబర్ రెడ్డమ్మ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. రైల్వేకోడూరు కోర్టులో జడ్జి అంజనీప్రిదర్శిని మాట్లాడుతూ మహిళలకు అనేక చట్టాలు ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలు ధైర్యంగా ముందుగా సాగాలని పిలుపునిచ్చారు. సీఐ టి. బాబు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట: సమాజంలో మహిళలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో సభాభవ నంలో సీడీపీవో భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు మణెమ్మ, నిర్మల జయలక్ష్మిని ఘనంగా సన్మానిం చారు. తహసీల్దారు శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రత్యేక కృషి

- ఎన్నికల ప్రచారం ప్రారంభించిన మండిపల్లి

రాయచోటిటౌన్, మార్చి7: రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం రాయచోటి మున్సిపాలిటీలోని 6, 7 వార్డుల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు గడప గడపలో అపూర్వ స్వాగతం పలికారు. ఆయా వార్డుల్లోని నాయకులతో కలిసి ఇంటింట ప్రచారం చేస్తూ ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి పార్లమెంటరీ అభ్యర్థితో పాటు, అసెంబ్లీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వండి, రాయచోటి నియోజకవర్గంతో పాటు ముస్లింల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. అనంతరం పలువురు ముస్లిం నేతలు రాంప్రసాద్‌రెడ్డి పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాజుల ఖాదర్‌బాషా, మాజీ కౌన్సిలర్ అతావుల్లా, ఖాదర్‌హుస్సేన్, టీచర్ మహబూబ్‌బాషా, హోటల్ ఫరూక్, హోటల్ ఫయాజ్, అన్వర్, మహబూబ్, ముత్యార్, అతావుల్లా, షంషీర్, ఫయాజ్, అల్లాబకష్, షాకీర్ తదితర మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక

రాయచోటి పట్టణంలోని 14వ వార్డుకు చెందిన పలువురు యువకులు గురువారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి సుగవాసి బాల సుబ్రమణ్యం, రాయచోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా 14వ వార్డు బూత్ ఇన్‌చార్జి షేక్. ఫజిల్, జావిద్, కిరణ్, ఆర్షిద్, సాధిక్, రెడ్డిబాషా, లోకేతేజ, హనీఫ్, అంజి, ఇర్ఫాన్, రాంప్రసాద్, సిద్దార్థ, అరబ్‌ఖాన్, రఫీతో సహా 30 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంజీవరెడ్డి, గవర్నర్ ఫంక్షన్ హాల్ యజమాని జాఫర్‌అలీ, బాషాఖాన్, అర్షాద్, ఖలీల్‌తో పాటు టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా ముస్లింలకు అభివాదం చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

విద్యుత్ వృథాను అరికట్టాలి: ఎస్ఈ

రాజంపేట టౌన్, మార్చి7 : రాష్ట్ర ప్రభుత్వం యూనిట్ 8.60 పైసలతో విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేస్తుందని, కావున వినియోగదారులు విద్యుత్‌ను పొదుపు చేయాలని ఎస్ఈ రమణ కోరారు. గురువారం డీఈ కార్యాలయంలో సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, పెనగలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లె, చిట్వేలి, కోడూరు మండలాల అధికారులతో క్షేత్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్‌ఆర్డర్లు పూర్తి చేయని అధికారులను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్యుత్ బకాయిల వసూలుపై దృష్టి సారించాలన్నారు. కొత్త వ్యవసాయ సర్వీసుల విడుదల మరింత వేగవంతంచేయాలని ఆదేశించారు. పొలాలకు విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏఈ రాజశేఖర్‌రెడ్డి, డీఈ, ఇంజనీర్లు, ఏఈ, జేఈ, అకౌంట్ అధికారులు పాల్గొన్నారు.


విద్యుత్‌అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్ఈ రమణ

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు



విద్యుద్దీప కాంతుల్లో రాయచోటి అగస్త్యేశ్వరాలయం, నక్కలవాండ్లపల్లె శివాలయం

రాయచోటిటౌన్/గాలివీడు, మార్చి7: శివరాత్రి మహోత్సవాలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. వారం రోజులుగా ఆలయాలను రంగులతో తీర్చి దిద్దారు. మరికొన్ని ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.మహాశివరాత్రి సందర్భంగా పాతరాయచోటిలోని అగస్త్యేశ్వరాలయాన్ని విద్యుత్ దీపాలతో అలం కరించారు.

సుండుపల్లె: పాత జంగంపల్లెలో గౌరీ సమేత జంగమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 6 గంటలకు గణపతిపూజ, గౌరీపూజ, సుబ్రహ్మణ్యంస్వామి పూజ, నందీశ్వర పూజలతో పాటు అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాదాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. జరుగుమల్లి వీరభద్రయ్య కుమారులు రమేశ్, లక్ష్మిశేఖర్ ఆధ్వర్యంలో అన్నదానం ఉంటుదన్నారు. సాయంత్రం, మహామంగళహారతి రాత్రి 8.30 గంటలకు కీచక వధ అనే నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం: మండలంలోని తిమ్మసముద్రం చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, మండల కేంద్రంలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

సంబేపల్లి: మహాశివరాత్రి సందర్భంగా వెంకటశివసాయిఆలయ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరిం చారు. చేపట్టారు. జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు రాత్రిపూట హరికథ, ఆర్కెస్ట్రా వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు అమర్‌నాథరెడ్డి, జగన్నాథరెడ్డి తెలియజేశారు. భక్తులందరూ మహాశివరాత్రి నాడు స్వామి వారిని దర్శించుకొని జాతర మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రేపు చింతోళ్లమాలి తిరుణాల

చిన్నమండెం, మార్చి7: మండలంలోని దేవగుడిపల్లె ఇలవేల్పు చింతోళ్లమాలి పెద్దయ్య స్వామికి శనివారం తిరుణాల నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం చింతోళ్లమాలిలో పూజలు నిర్వహిస్తారు. అర్ధరాత్రి దేవరెద్దు జల్లావాండ్లపల్లె నుంచి దేవగుడిపల్లెలోని దేవరింటికి చేరుకుంటుంది. శనివారం తెల్లవారుజామున దేవగుడిపల్లె, కురవపల్లి మీదుగా చింతోళ్లమాలికి చేరుకున్నాక జాతర ప్రారంభమవుతుందని పూజారి తెలిపారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వచ్చే భక్తులకు టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని భక్తులకు, పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

తిరుణాల ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

సుండుపల్లె, మార్చి7: మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీ ఉప్పర పల్లి సమీపంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న చౌడేశ్వరమ్మ తిరుణా ల ఏర్పాట్లను పరిశీలించినట్లు ఎస్ఐ ఎస్కే హుస్సేన్ తెలిపారు. చాందినీ బండ్లు కట్టే భక్తులు పోలీస్‌స్టేషన్‌లో అనుమతులు తీసుకోవాలని కోరారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. చాందినీ బండ్లు వచ్చేటప్పుడు కరెంటు తీగలు తగిలే ప్ర మాదం ఉందా అని పరిశీలించారు. ఇప్పటికి ఏడు చాందినీ బండ్లకు అనుమతులు పొందినట్లు తెలిపారు. ఏఎస్ఐ వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

కర్తవ్యం వైపు నడిపించే గ్రంథం భగవద్గీత

ఓబులవారిపల్లె, మార్చి 7: భవబంధా ల్లో చిక్కుకున్న మానవులను కార్యోన్ముఖులను చేసే గ్రంథరాజం భగవద్గీత అని హిందూ ధర్మప్రచార పరిషత్ ధ ర్మాచార్యులు గంగనపల్లి వెంకటరమణ అన్నారు. మండలంలోని కటికంవారి పల్లె శ్రీకృష్ణ మందిరంలో టీటీడీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక ఉపన్యా సాలలో భాగంగా గురువారం ఆయన ప్రసంగించారు. భవసాగరాన్ని దాటుకోవడానికి గీత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకురాలు లీలావతమ్మ, కటికం జయమ్మ, పుల్లగంటి వెంకటసుబ్బమ్మ, సావిత్రమ్మ, అరిగెల శ్రీనివాసులు, కటికం ధనుంజయ, కటికం నాగేంద్ర, అరిగెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ పనులకు శంకుస్థాపన

వీరబల్లి, మార్చి 7: మండల పరిధిలోని కాటుగుంటపల్లి పంచాయతీలో సబ్‌స్టేషన్ పనులకు గురువారం జెడ్పీ చైర్మెన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ పురుషోత్తంరెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



టీడీపీ విజయం కోసం ప్రజల ఎదురుచూపు

రైల్వేకోడూరు, మార్చి 7: టీడీపీ విజయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని నియోజకవర్గ నాయకురాలు నగరిపాటి రేవతి తెలిపారు. గురువారం రైల్వేకోడూరు మండలంలోని కేఆర్‌కండ్రిక గిరిజన కాలనీలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో టీడీపీకి పూర్వవైభవం వస్తుందన్నారు. జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తేనేపల్లె చిన్నా, మాజీ తహసీల్దార్ నగరిపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

రైల్వేకోడూరు, మార్చి 7: ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని రైల్వేకోడూరు తహసీల్దార్ శివరాముడు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయ సభా భవనంలో పోలీసులు, ఎన్నికల సెక్టారు అధికారులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ప్రలోభాలకు లొంగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పార్టీలకు అతీతంగా ఎన్నికల సిబ్బంది పని చేయాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. రాజకీయ నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ఎన్నికల అధికారుల అనుమతి తప్పని సరిగా తీసుకోవాలన్నారు. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల నిబంధనలు పాటించాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి కోడ్ అమలులో ఉంటుందన్నారు. సాంకేతిక లోపాల కారణంగా ఈవీఎంలు పని చేయకపోతే వెంటనేఎన్నికల అధికారులకు సమాచారం అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఆకుల సిద్ధేశ్వరరావు, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ గురుకులం'లో 10న ప్రవేశ పరీక్ష

లక్కిరెడ్డిపల్లె, మార్చి 7: అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 10న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4;30 వరకు పరీక్ష ఉంటుదని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు విద్యార్థులు ఉదయం అండేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను చేరుకొని హాల్‌టికెట్లు పొందవచ్చుచన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు పరికరాల పంపిణీ


విభిన్న ప్రతిభావంతులకు పరికరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, మార్చి 7: స్థానిక హెచ్‌ఎంఎం హైస్కూలులో గురువారం విభిన్నప్రతిభావంతులకు సహాయ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు చెర్లోపల్లి రెడ్డప్ప, రాష్ట్ర నాయకుడు గుణశేఖర్ మాట్లాడుతూ అలింకో, భారత ప్రభుత్వం, జిల్లా యాజమాన్యం సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. రైల్వేకోడూరు మండలానికి చెందిన 332 మందికి రూ. 54లక్షలు విలువ చేసే సహాయ పరికరాలు అందించారన్నారు. ఇందుకోసం రూ. 30,94,000 సీఎస్ఆర్ నిధులు వచ్చాయని తెలిపారు. పుల్లంపేట విభిన్న ప్రతిభాంతుల సమైక్య సేవా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి, జిల్లా వికలాం గుల నాయకులు ఖలీల్, రైల్వేకోడూరు ఇన్‌చార్జి ధనుంజయ పాల్గొన్నారు.

ఓపీఎస్ అమలు చేస్తామన్న పార్టీకే ఓట్లు

పెనగలూరు, మార్చి7 : ఓపీఎస్‌ను అమలు చేస్తామన్న పార్టీకే ఓట్లు వేస్తామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.హరిప్రసాద్ అధ్యక్షతన గురువారం నుంచి మండల వ్యాప్తంగా ప్రచార కార్యక్రమం ప్రారంభమైంది. ముందుగా పాఠశాలల గోడలపై అచ్చుతో ముద్రించిన నినాదాలతో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు ప్రతి ఇంటికి ఈ నినాదాలు తీసుకెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

వాహనాల తనిఖీ

రామాపురం, మార్చి7: మండలంలోని కొత్తరోడ్డు నారాయణపురం పోలీసు చెక్‌పోస్టు వద్ద గురువారం సాయంత్రం లక్కిరెడ్డిపల్లె సీఐ గంగాధర్‌బాబు, ఎస్ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల సందర్భంగా ముందు జాగ్రత్తగా వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు వాహనదారులు తమ రికార్డులు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

జీవో నెంబరు 15 ను అమలు చేయాలి

పెనగలూరు, మార్చి7 : ముదిరాజ కులస్తుల అభివృద్ధి కోసం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విడుదల చేసిన జీవో 15ను జగన్ ప్రభుత్వం అమలు చేయాలని ముదిరాజ మహాసభ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల శివశంకర్ కోరారు. ఈ మేరకు రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు మారేష్ ముదిరాజ్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. విజయవాడలోని ముదిరాజు కార్యాలయంలో ఆయనను కలిసి సన్మానించినట్లు తెలిపారు. బీసీ-డీ గ్రూపులో ఉన్న ముదిరాజ కులస్తులను ఏ గ్రూపులోని మారుస్తూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవో నెంబరు 15ను విడుదల చేశారన్నారు. ప్రతిఏడు ముదిరాజ కార్పొరేషన్ అభివృద్ధి కోసం 150 కోట్ల నిధులను విడుదల చేయాలని ఆ జీవోలో పేర్కొన్నారని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు ఆ జీవో అమలు కాలేదని తెలిపారు.

విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి

రాజంపేట, మార్చి7 : విద్యార్థులు విద్యతో పాటు క్రీడ, పలు రంగాల్లో నైపుణ్యత సంపాదించాలని ఆర్ఈపీ భానుమూర్తిరాజు, ఎంఈవో సుబ్బరాయుడు, రిటైర్డ్ పీడీ షేక్ సమీర్‌బాషా సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ క్రీడా మైదానంలో శ్రీసాయి విద్యాలయ పాఠశాల కరస్పాండెంటు డాక్టర్ ఎస్.బాలరాజు, ప్రిన్సిపల్ రేణుకాదేవి ఆధ్వర్యంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, పరుగుపోటీ విజేతల కుగెలుపొందని వారికి బహుమతులు ప్రధానం చేశారు.

రైల్వేకోడూరు: గాంధీనగర్‌లోని విజ్‌డమ్ సీబీఎస్ఈ స్కూలులో గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు సీఐ టి. బాబు మాట్లాడుతూ తల్లిదండ్రులు చదువు తో పాటు క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వాలన్నారు. అనంతరం విద్యార్థులతో కబడ్డీ ఆడారు. బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల డైరెక్టర్స్ డాక్టర్ ప్రదీప్, మదన్‌మోహన్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

సుండుపల్లె, మార్చి7: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయన్న కోరారు. గురువారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. వశిష్ట హైస్కూల్‌లో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు హరికుమార్, వెంకట్రమణ, దేవలానాయక్, ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లి: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ప్రతిభను చాటాలని ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం పెద్దజంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చక్రపాణి ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభను చాటిన విద్యార్థిని స్పందన తండ్రికి ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ 5 వేలు, ఉపాధ్యాయుడు శివహరి రూ.2500 నగదు బహుమతి అందజేశారు. అనంతరం మణికంఠ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మార్ల ఓబుల్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, సమంతసేన్, మురళి, చంద్రయ్య, మహబూబ్‌బాషా, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముక్కా ఫౌండేషన్ ఆర్థిక సాయం

ఓబులవారిపల్లె, మార్చి 7: లింపోబ్లాస్టిక్ లుకేమియాతో బాధపడుతున్న గాదెల కొత్తపల్లెకు చెందిన రెడ్డిపాకు సుబ్రమణ్యం కూతురుకు చికిత్స నిమిత్తం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా రూపానందరెడ్డి తనయుడు, టీడీపీ యువ నాయకుడు ముక్కా సాయి వికాస్‌రెడ్డి 20వేల రూపాయలులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలి హరి, మిణుకు హరి, పోలి పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



గాయని పి. సుశీలకు డాక్టరేట్ అందజేస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థినులు

లింగ సమానత్వంతోనే
దేశానికి విశ్వ గురుస్థానం

పద్మావతి వర్సిటీ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 7:లింగ సమానత్వం సాధించడం ద్వారానే మన దేశం విశ్వ గురువుగా నిలవడానికి అవకాశం కలుగుతుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని పద్మావతి మహిళా యూనివర్సిటీ 21వ స్నాతకోత్సవం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఛాన్సలర్ హోదాలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ లింగ సమానత్వమనేది మహిళా సాధికారతకు సంబంధించిన అంశం మాత్రమే కాదనీ, ఇది దేశాభివృద్ధితోనూ ముడిపడి ఉన్న విషయమని చెప్పారు. లింగ సమానత్వపు అంతిమ లక్ష్యం స్త్రీ, పురుషులు సమాన హక్కులు పొందడమే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడానికి పద్మావతి యూనివర్సిటీ దోహదం చేస్తోందని కితాబిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇస్రో రిటైర్డు శాస్త్రవేత్త మంగళమణి మాట్లాడుతూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవడం ద్వారా తాము ఎంచుకున్న రంగంలో రాణించే అవకాశం మహిళలకు ఉంటుందన్నారు.తాను టెక్నాలజీ వైపు ఆసక్తి పెంచుకోవడానికీ, ఇస్రో శాస్త్రవేత్తగా రాణించడానికీ తల్లిదండ్రుల ప్రోత్సాహం, దేవుడి దయతో పాటు ఆత్మ స్థైర్యం చాలా ఉపయోగపడిందన్నారు.అంటార్కిటిక్ ఎక్స్‌పెడిషన్ కోసం 400 రోజుల ప్రయాణంలో ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నానని గుర్తు చేసుకున్నారు.ఓ మహిళగా ఈ సమస్యలన్నింటినీ ఆత్మ స్థైర్యంతోనే పరిష్కరించుకున్నానన్నారు.వీసీ ప్రొఫెసర్ భారతి, మాట్లాడుతూ పి.సుశీల వంటి అద్వితీయమైన గాయనికి గౌరవ డాక్టరేట్ అందించడం మహిళా యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఈ తరం విద్యార్థినులు సుశీల చేసిన కృషి నుంచీ స్ఫూర్తి పొందాలని సూచించారు. మహిళాభివృద్ధిలో నాలుగు దశాబ్దాలుగా తన వంతు కృషి చేస్తున్న పద్మావతి వర్సిటీ జాతీయ, అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలతో ఒప్పందాలు చేసుకొని బోధన, పరిశోధనల్లో పరస్పరం సహకరించుకుంటున్నట్టు తెలిపారు.అనంతరం ప్రముఖ గాయని పి. సుశీలకు గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రదానం చేశారు. గౌరవ డాక్టరేట్, ధృవీకరణ పత్రం, జ్ఞాపికతో సుశీలను సత్కరించారు. ప్రతిభ కనబరిచిన 57 మంది విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. సైన్స్ విద్యార్థినులు 30మంది, ఆర్ట్స్ విద్యార్థినులు 21మంది, ఇంజనీరింగ్ విద్యార్థినులు ఆరుగురు బంగారు పతకాలు స్వీకరించగా 12 మంది ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులు పుస్తక బహుమతులు అందుకున్నారు. నలుగురు ఆర్ట్స్, ఇంజనీరింగ్ విద్యార్థులు నగదు బహుమతులు పొందారు.పీహెచ్‌డీలు 86మందికి, ఇద్దరికి ఎంఫిల్, పీజీ పట్టాలు 771మందికి, డిగ్రీ పట్టాలు 872మందికి, దూరవిద్యకు సంబంధించిన డిగ్రీలు 72మందికి, పీజీ పట్టాలు 50 మందికి అందజేశారు.

టీడీపీకి నో పర్మిషన్

● వైసీపీకి మాత్రం నో అబ్జక్షన్

చిత్తూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్నా కొంతమంది అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీకి అనుకూలంగా.. ప్రతిపక్షాలకు ఇబ్బందులు పెడుతున్నారు. తాజాగా గుడిపాలలో జరిగిన ఓ ఘటనే నిదర్శనం. గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా నరహరిపేట జడ్పీ హైస్కూల్ మైదానం ఉంది. ఇక్కడ జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటామని టీడీపీ నాయకులు ఎంపీడీవోను కోరారు. ఆ స్థలం తన పరిధిలో లేదని ఆయన చెప్పారు. దీంతో అనుమతి కోసం జడ్పీ సీఈవో గ్లోరియాకు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రానందున మైదానంలో సభ ఏర్పాటుకు అనుమతివ్వాలని, ఒకవేళ కోడ్ ఉన్నా అనుమతితో సభలు నిర్వహించుకోవచ్చనే విషయాన్ని ప్రస్తావిస్తూ ఎన్నికల సంఘం సూచనల్ని దరఖాస్తుకు జత చేశారు. అయినా జడ్పీ సీఈవో గ్లోరియా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పేరుతో అనుమతివ్వలేదు. దీంతో టీడీపీ నాయకులు చేసేదేమీలేక వసంతాపురం టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా స్థలంలో జయహో బీసీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంతవరకు బానే ఉన్నా.. అదే హైస్కూల్ మైదానంలో వైసీపీ నాయకులు సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు మాత్రం అధికారులు అనుమతులిస్తున్నారు. అసలు ఎలాంటి అనుమతిలేకుండానే సమావేశాలు నిర్వహించారన్న ఆరోపణలున్నాయి. రెండు నెలల కిందట విజయానందరెడ్డి ఇదే మైదానంలో ఓ కార్యక్రమాన్ని నిర్వహించి దుస్తుల పంపిణీ చేపట్టారు. అప్పుడు అధికారులకు నిబంధనలు గుర్తుకు రాలేదు. ఇక, ఈ నెల 11న కూడా ఇక్కడే మరో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైసీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థలాన్ని పరిశీలించారు. టీడీపీ విషయంలో అనుమతులు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టే అధికారులు, వైసీపీ కార్యక్రమాలకు అభ్యంతరం చెప్పకపోవడం విమర్శలకు తావిస్తోంది.

భార్యపై అనుమానంతో హత్య



మృతిచెందిన శెల్వి

గుడుపల్లె, మార్చి 7: తాగుడుకు బానిసై భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఆమెను వేధించి.. హతమార్చిన ఘటన గురువారం గుడుపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. ఓఎన్ కొత్తూరు పంచాయతీ తల్లిఅగ్రహారానికి చెందిన బేటరాయన్ (44)కు తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి జిల్లా కొలిగూరుకు చెందిన శెల్వితో 17 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. బేటరాయన్ కూలి పనులతో జీవనం సాగించేవాడు. తాగుడుకు బానిసై నిత్యం భార్యతో గొడవ పడేవాడు. భర్త ఆగడాలు శ్రుతిమించడంతో గ్రామ పెద్దలతో పంచాయితీ పెట్టించినా మార్పురాలేదు. ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులు, బంధువులతో శెల్వి చెప్పుకొని బాధపడేది. ఈ క్రమంలో బుధవారం రాత్రి బేటరాయన్ భార్యతో గొడవపడ్డాడు. గురువారం ఉదయం అనారోగ్యంతో శెల్వి చనిపోయిందని తన బంధువులకు కబురు పంపాడు. శెల్వి కుటుంబ సభ్యులు తల్లి అగ్రహారం చేరుకొని మృతదేహాన్ని పరిశీలించగా.. గాయాలు కనిపించాయి. బేటరాయన్‌ను ప్రశ్నించగా పొంతనలేని మాటలు చెప్పాడు. దీంతో అనుమానించి వారు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ లక్ష్మీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. బేటరాయన్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా శెల్విని హత్య చేసినట్టు అతడు ఒప్పుకొన్నాడు. నిందితుడిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. శెల్వి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్



పుంగనూరురూరల్, మార్చి7: కర్ణాటక మద్యం తరలిస్తున్న కారుతోపాటు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పుంగనూరు మండలం చదళ్ల బస్టాప్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ కారును నిలిపి తనిఖీ చేయగా అందులో (20కేసులు మద్యం)రూ.1,20,000 విలువ చేసే కర్ణాటక మద్యం గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పుంగనూరు ఈస్టుపేటకు చెందిన రాజేశ్, వెంకటరత్నం, అజయ్, సింగిరిగుంటకు చెందిన నారాయణస్వామి స్నేహితులుగా ఉంటూ కూలీపనులు చేసుకుని జీవించేవారని చెప్పారు. వీరు జల్సాలకు అలవాటుపడి కర్ణాటక మద్యం కారులో తెచ్చి అధిక ధరలకు విక్రయించేవారని, దీనికి రాజేశ్ ముఖ్యుడని తెలిపారు. కారులోని 1632 కర్ణాటక టెట్రా మద్యం ప్యాకెట్లు, కారును సీజ్ చేసి, అందులో ఉన్న సింగిరిగుంటకు చెందిన ఎం.నారాయణస్వామి(34), ఈస్టుపేటకు చెందిన వెంకటరత్నం(34), అజయ్(26)లను అదుపులోకి తీసుకోగా రాజేశ్ పరారీ అయినట్లు వివరించారు. ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. దాడుల్లో సీఐ రాఘవరెడ్డి, ఎస్ఐ సుకుమార్, సిబ్బంది ఎల్లప్ప, చిన్నరెడ్డెప్ప, రెడ్డెప్ప, ప్రకాశ్ పాల్గొన్నారని వీరిని ప్రశంసించి వారికి రివార్డులు అందజేశారు.

నాయనూరులో భూదందా!

● ప్రభుత్వ భూమి కర్ణాటకవాసికి ధారాదత్తం
● వైసీపీ నేత అనుచరుడి హస్తం
● తహసీల్దారుకు గ్రామస్తుల ఫిర్యాదు
● భూమిపంచి తమకు న్యాయం చేయాలని వినతి



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నరైతులు

కుప్పం, మార్చి 7: కుప్పం మండలం నాయనూరులో స్థానికులైన రైతు అనుభవంలో ఉన్న ప్రభుత్వ భూమి.. కర్ణాటకకు చెందిన మహిళ పేరుతో పట్టా అయిపోయింది. మండలంలో చక్రం తిప్పే వైసీపీ నేత అనుచరుడి ప్రోద్బలంతోనే వీఆర్వోల స్థాయిలో ఈ భూమి చేతులు మారిందని ఆరోపిస్తూ, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గురువారం కుప్పం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. బాధితులు తెలిపిన ప్రకారం.. నాయనూరు ఎస్సీ కాలనీ గ్రామ కంఠాన్ని ఆనుకుని సర్వే నెంబరు 236/2లో 2.56 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులోనే 56 సెంట్ల విస్తీర్ణంలో కంగుంది-2 సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతుండగా హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆగిపోయాయి. ఈ ప్రభుత్వ భూమిలో రాజేశ్వరి, మురుగేశ్ అనే రైతులు సుమారు 30 ఏళ్లుగా కొంత భూమిని అనుభవంలో ఉంచుకుని సాగు చేస్తున్నారు. ఇలా జరుగుతుండగా ఓ వైసీపీ నేత అనుచరుడి ప్రోద్బలంతో కర్ణాటకకు చెందిన ఒక మహిళకు అడ్డదారిలో ఆ భూమికి పట్టా ఇచ్చారు. ఆ కర్ణాటక మహిళ తన పట్టా భూమిని సర్వే చేయాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే పట్టా ఒకరిపైన, క్షేత్ర స్థాయిలో అనుభవం మరొకరిపైన ఉండడంతో అధికారులు జాప్యం చేస్తూ వచ్చారు. చివరకు వైసీపీ నేతల ఒత్తిడితో గత ఫిబ్రవరి నెల 29వ తేది వివాదాస్పద భూమి వద్దకు వచ్చి సర్వే చేశారు. ఆ భూమి అనుభవంలో ఉన్న స్థానిక రైతులు మురుగేశ్, రాజేశ్వరి అభ్యంతరం వ్యక్తం చేయగా పోలీసు భద్రతలో పనికానిచ్చారు. దీనిపై గురువారం సంబంధిత రైతులతో సహా గ్రామస్తులు పలువురు తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా చేశారు. కర్ణాటకవాసికి భూమి మీద పట్టా ఎలా ఇస్తారని నిలదీశారు. వెంటనే పట్టాను రద్దు చేయాలని డిమాండు చేశారు. ఎస్సీ కాలనీలో సుమారు 100 కుటుంబాలు ఉన్నాయని, వారికి ఆ భూమిని పంచితే సొంత గూడు కట్టుకుంటారని విన్నవించుకున్నారు. ఈ మేరకు తహసీల్దారు హరికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

హరి హరుల క్షేత్రం మొగిలి



ప్రత్యేక అలంకారంలో మొగిలీశ్వరస్వామి



మహాశివరాత్రికి ముస్తాబైన మొగిలీశ్వరాలయం

బంగారుపాళ్యం, మార్చి 7: కొండల మధ్యన.. ఆహ్లాదకర వాతావరణంలో స్వయంభువుగా ముక్కంటి అక్కడ వెలిశారని స్థలపురాణం చెబుతోంది. హరితో కొలువైనందున మొగిలికి హరిహర క్షేత్రమని పేరొచ్చింది. మొగిలీశ్వరుడిని దర్శించుకునే భక్తులకు శఠగోపంతో పూజారులు ఆశీర్వదించడం ఇక్కడి ప్రత్యేకత. సర్పదోష నివారణకోసం చేసే రాహుకేతు పూజలను ఈ ఆలయంలో చేయించుకుంటే మంచి కలుగుతుందని స్థానికుల నమ్మకం. ఈ ఆలయంలో నిద్రచేస్తే సంతాన భాగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఆ చుట్టుప్రక్కల గ్రామాల్లోనే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు ఇక్కడికి వస్తుంటారు. ఏటా మహాశివరాత్రి సందర్భంగా మొగిలీశ్వరస్వామి దేవస్థానంలో పన్నెండు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో ఉభయదారుల చేతులమీదుగా ఒక్కో రోజు ఒక్కో ఉత్సవం జరిపి, స్వామివారిని మేళతాళాలతో ఊరేగిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారు. ఈ క్రమంలో శుక్రవారం నాటి మహాశివరాత్రికి మొగిలి క్షేత్రాన్ని గురువారం సాయంత్రానికే ముస్తాబు చేశారు. స్వామి వారికి విశేష అలంకరణలు చేశారు. విద్యుద్దీపాలంకరణలు చేపట్టారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని అధికారనంది వాహనంపై ఊరేగించారు.

వైసీపీ హయాంలో ముస్లిం మైనారిటీలపై దాడులు

మిస్బా తల్లిదండ్రులకు ఇప్పటికీ జరగని న్యాయం ● 'మండలి' మాజీ చైర్మన్ షరీఫ్



టీడీపీలో చేరిన ముస్లిం, మైనారిటీ నేతలతో షరీఫ్, అమర్

వి.కోట, మార్చి 7: వైసీపీ అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీలపై దాడులు పెరిగిపోయాయని శాసన మండలి మాజీ చైర్మన్ ఎంఏ షరీఫ్ ఆందోళన వ్యక్తంచేశారు. వి.కోటలో గురువారం ముస్లిం, మైనారిటీలతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వరుసగా మైనారిటీలపై జరిగిన దాడులను గుర్తు చేశారు. 'క్రిస్టియన్లపై ఊచకోత జరిగితే నోరు మెదపడు. కానీ, తాను క్రిస్టియన్ అంటాడీ సీఎం. అసలు ఈ సీఎంపై ఏ వర్గానికీ నమ్మకం లేకుండా పోయింది' అని పేర్కొన్నారు. పలమనేరులోని మిస్బా ఘటనను ఆయన గుర్తుచేస్తూ.. ఇప్పటికీ ఆమె తల్లిదండ్రులకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 నుంచి కేంద్రంలో బీజేపీతో ఉన్న వైసీపీ.. ఇప్పుడు టీడీపీ జతకడుతోందంటూ ఎన్నికలో లబ్ధి కోసం ప్రచారం చేస్తోందని, అది ఎన్నటికీ నెరవేరదన్నారు. ముస్లిం, మైనారిటీల సంక్షేమం కొనసాగాలంటే టీడీపీ అధికారంలోకి రావడమే మార్గమన్నారు. టీడీపీ హయంలో ముస్లిం, మైనారిటీల అభ్యున్నతికి అమలు చేసిన అనేక పథకాలను రద్దు చేసిన జగన్‌కు తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. యాలకల్లు పంచాయతీ ఎం.ఎం.కుంట గ్రామానికి చెందిన పలువురు ముస్లిం సోదరులు వారి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి పసుపు కండువాలు వేసిన అమర్.. తన 40 ఏళ్ల రాజకీయ జీవితం ముస్లిం, మైనారిటీల సహకారంతోనే ముందుకు సాగిందని, రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ముస్తాక్ అహమ్మద్, ఉపాధ్యక్షుడు షేక్ ఉమర్, మైనారిటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఇక్బాల్, నియోజక వర్గ నేతలు ఖాజా పీర్, రుహుల్లా, చాంద్‌బాషా, నాసిర్, ఇక్బాల్, అయాజ్‌బాషా, నవాబ్, అక్బర్, మాము, షఫీ తదితరులు ఉన్నారు.

ఎస్ఏల పదోన్నతికి 11న ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు (సెంట్రల్), మార్చి 7: విద్యాశాఖ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పని చేస్తున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కోసం ఈనెల 11న మధ్యాహ్నం 3 గంటలకు డీఈవో కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాలను పరిశీలించనున్నట్లు డీఈవో దేవరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌కు అర్హత కలిగిన ఎస్జీటీలు రీహ్యాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జారీ చేసిన స్పెషల్ ఎడ్యుకేషన్ బి.ఈడీ, సేవా పుస్తకం, తగిన సర్టిఫికెట్లతో ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకావాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ చేయూతకు రూ.195.42 కోట్లు



చెక్కు అందజేస్తున్న జేసీ

చిత్తూరు, మార్చి 7: వైఎస్సార్ చేయూత పథకం కింద 1,04,226 మందికి ప్రభుత్వం రూ.195.42 కోట్లను విడుదల చేసినట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం అనకాపల్లి నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. చిత్తూరులో లబ్ధిదారులకు జేసీ, ఇతర ప్రజా ప్రతినిధులు మెగా చెక్కు అందించారు. వీవోలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో నటుడు గోపీచంద్



ఐరాల (కాణిపాకం), మార్చి 7: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని గురువారం సాయంత్రం సినీ నటుడు గోపీచంద్ దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.

మినీ లారీని ఢీకొన్న లారీ

● ఎనిమిది మందికి స్వల్ప.. ఒకరికి తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పూతలపట్టు, మార్చి 7: పూతలపట్టు మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది స్వల్పంగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వావిల్‌తోట పంచాయతీ మూర్తిగానివూరుకు చెందిన తొమ్మిది మంది మహిళలు చిత్తూరు- తిరుపతి జాతీయ రహదారిలోని డివైడర్ల మధ్యలో వున్న గడ్డిని తొలగించేందుకు మినీలారీలో రంగంపేట క్రాస్ రోడ్డు సమీపాన వెళుతున్నారు. అదే సమయంలో తిరుపతి వైపు వెళ్తున్న లారీ వెనుకవైపు నుంచి ఢీకొంది. మినీలారీ నుంచి కిందపడిన సుశీల, అమృతవల్లి, లత, అంగమ్మ, కుప్పమ్మ, విజయ, వళ్ళెమ్మ, ఉష, రూపమ్మ గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో సుశీలమ్మకు తీవ్ర గాయాలవ్వడంతో వేలూరు సీఎంసీకి తరలించారు. ఈ మేరకు పూతలపట్టు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడెక్కిన తిరుపతి రాజకీయం

● పవన్ తప్ప బయటి వారు గెలవడం కష్టం!
● అచ్చెన్నకు తేల్చి చెప్పిన తిరుపతి టీడీపీ నేతలు
● ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై కొనసాగుతున్న ప్రతిష్టంభన

తిరుపతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ సీటు పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్టు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తిరుపతి టీడీపీ నేతలు నరసింహ యాదవ్, సుగుణమ్మలకు స్పష్టం చేశారు. గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయానికి పిలిపించిన అచ్చెన్నాయుడు తిరుపతికి ఉమ్మడి అభ్యర్థిగా ఎవరు ఖరారైనా వారి గెలుపుకోసం సహకరించాలని చంద్రబాబు మాటగా చెప్పారు. అయితే తిరుపతిలో పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే పర్వాలేదని, అలాకాక స్థానికేతర అభ్యర్థి అయితే గెలవడం కష్టమని వారు కూడా అచ్చెన్నాయుడికి తేల్చి చెప్పేశారు. పార్టీ ఆవిర్భావం నుంచీ తన కుటుంబం తిరుపతిలో టీడీపీ కోసం కష్టపడి పనిచేస్తోందని, గత నాలుగు ఎన్నికల్లో టికెట్ ఆశించినా అవకాశం దక్కలేదని అచ్చెన్న ఎదుట నరసింహ యాదవ్ వాపోయారు.అనంతరం మనస్తాపంతోనే తిరుపతికి వెనుదిరిగారు.

టికెట్ ఇస్తే జనసేనలో చేరేందుకు సుగుణమ్మ సిద్ధం

టీడీపీ టికెట్‌పై గంపెడు ఆశ పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా తిరుపతి సీటును మిత్రపక్షమైన జనసేనకు కేటాయించడంతో తీవ్ర నిరాశకు లోనయ్యారు. అయితే ఉమ్మడి అభ్యర్థిగా టికెట్ దక్కేటట్టు అయితే జనసేనలో చేరేందుకు సిద్ధంగా వున్నట్టు తెలిసింది.జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కలవడానికి యత్నిస్తున్నట్టు తెలిసింది.ఆయన ఢిల్లీ నుంచీ మంగళగిరి వచ్చాక కలిసే ఉద్దేశంతో సుగుణమ్మ అక్కడే వున్నారని సమాచారం.ఆశావహులందరిలోనూ తనకే గెలుపు అవకాశాలు అధికంగా వున్నాయని, ఆ మేరకు టికెట్ ఇవ్వాలని జనసేన అధినేతను కోరనున్నట్టు తెలిసింది. గురువారం తిరుపతి టీడీపీ నేత ఊకా విజయ్‌కుమార్ మంగళగిరిలో పవన్ కళ్యాణ్‌ను కలిశారు. ఉమ్మడి అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. తిరుపతిలో అభ్యర్థి ఎవరైతే విజయావకాశాలు అధికంగా వుంటాయో తెలుసుకునేందుకు సర్వేలు నిర్వహిస్తున్నామని, వాటి ఫలితాలు వచ్చాక నిర్ణయం తీసుకుంటామని పవన్ స్పష్టం చేసినట్టు తెలిసింది. చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేన పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన తిరుపతి జనసేన నేతలు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ కూడా పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్‌లను కలిశారు.చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి జనసేన టికెట్ రేసులో వున్నట్టు ప్రచారమవుతున్న సంగతి తెలిసిందే. అయితే గురువారం ఆయన మంగళగిరిలో జనసేన పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ శ్రీనివాసులు ఎలాంటి షరతులు లేకుండా, టికెట్ కూడా ఆశించకుండా జనసేనలో చేరుతున్నారని ప్రకటించారు. ఈ వ్యాఖ్యతో శ్రీనివాసులుకు తిరుపతి టికెట్ విషయమై పార్టీ వర్గాల్లో అనుమానాలు తలెత్తాయి.

జనసేన టికెట్ తిరుపతి బలిజలకే ఇవ్వాలి!

తిరుపతి జనసేన టికెట్ స్థానికంగా వున్న బలిజలకే కేటాయించాలన్న డిమాండ్ ఊపందుకుంది. గురువారం బలిజసేన ఆధ్వర్యంలో మన తిరుపతి -మన బలిజలు- మన సీటు అనే నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.రాయలసీమ వ్యాప్తంగా చూస్తే తిరుపతిలో బలిజలు అధిక సంఖ్యలో వున్నారని, జనసేన గెలిచే మొదటి సీటు కూడా తిరుపతే అవుతుందని అభిప్రాయపడ్డారు. అంగబలం, అర్థబలం చూపి టికెట్ తెచ్చుకునే స్థానికేతరులకు తాము సహకరించబోమని తేల్చి చెప్పారు. స్థానిక బలిజలకే టికెట్ ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.స్థానికులకే అసెంబ్లీ టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ ముందు ముందు బలపడే పరిస్థితి కనిపిస్తోంది.మొత్తం మీద పవన్ కళ్యాణ్ ఢిల్లీ నుంచీ మంగళగిరి వచ్చాకే తిరుపతి సీటుపై దృష్టి సారించే అవకాశముంది. ఎలా చూసినా మరో వారం రోజుల పాటు తిరుపతి ఉమ్మడి అభ్యర్థి ఎంపికపై సస్పెన్స్ కొనసాగనుంది.

నాటు తుపాకి కాల్పుల కేసులో.. ముగ్గురి అరెస్టు.. తుపాకీ స్వాధీనం

మదనపల్లె, మార్చి 7: వేటకోసం వాడే నాటు తుపాకాల కాల్పుల కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో గురువారం తాలూకా సీఐ ఎస్.శేఖర్‌తో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. మదనపల్లె మండలం ఆవులపల్లెకు చెందిన శివశ్రీరాములు, జి.శ్రీనివాసులు, మండెం నాగరాజులకు అడవి జంతువులను వేటాడే అలవాటు ఉంది. ఇందులోభాగంగా జనవరి చివరివారంలో వారు ముగ్గురూ ఆవులపల్లె శివారు ప్రాంతానికి వెళ్లి అడవి జంతువును కాల్చడానికి నాటుతు పాకీని పేల్చారు. అందులో నుంచి వచ్చిన నిప్పురవ్వలు..సమీపంలోని పొలంలో రాగిమడి కోస్తున్న అదే గ్రామానికి చెందిన సిద్దప్ప భార్య పాపులమ్మ కాలికి తగలాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుల పై యామ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేసినట్లు వారి నుంచి నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదిం చిన సీఐ ఎస్.శేఖర్, రవికుమార్, ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం, ప్రభా కర్‌ను డీఎస్పీ అభినందించారు.

హత్య కేసులో ముగ్గురు అరెస్టు

ములకలచెరువు, మార్చి 7: అన్నను హత్య చేసిన కేసులో గురువారం తమ్ముడితో పాటు అతని భార్య, కుమారుడ్ని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్, సీఐ మధు, ఎస్ఐ తిప్పేస్వామిలు వివరాలను వెల్లడించారు. ములకలచెరువు మండలం గాలేటివారిపల్లెకు చెందిన వెంకటప్ప తన ముగ్గురు కుమారులైన వెంకటరమణ, క్రిష్ణప్ప, శ్రీరాములుకు సమానంగా భూమిని పంచి ఇచ్చాడన్నారు. వారిలో శ్రీరాములు తన భూమిని అన్న క్రిష్ణప్పకు అమ్మేశాడన్నారు. ఈ నేపథ్యంలో జాతీ య రహదారి విస్తరణలో భాగంగా భూమి విలువ భారీగా పెరగడంతో తన భూమి తిరిగివ్వాలని శ్రీరాములు అన్న క్రిష్ణప్పపై తరచూ గొడవలకు పాల్పడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 2న శ్రీరాములు, అతని భార్య శాంతమ్మ, కుమారుడు సురేష్‌లు భూమిలో ప్రభుత్వ అధికారులు రీసర్వే చేసిన నాటిన రాళ్లను తొలగిస్తుండగా అన్న క్రిష్ణప్ప, అతని కుమారుడు హనుమంతు, కోడలు గీతాంజలిలు వెళ్లి అడిగారు. దీంతో ఆగ్రహించిన వారు క్రిష్ణప్ప తలపై కట్టెతో కొట్టి తీవ్రంగా గాయపరిచడమే కాకుండా కాళ్లతో తన్నారు. క్రిష్ణప్ప పరిస్థితి విషమించడంతో అదే రోజు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈ కేసులో నిందితులైన శ్రీరాములు, అతని భార్య శాంతమ్మ, కుమారుడు సురేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎక్స్‌కవేటర్‌ను ఢీ కొని వ్యక్తి మృతి

మదనపల్లె టౌన్, మార్చి 7: మండలంలోని బండకాడపల్లెకు చెందిన రహంతుల్లా(40) సొంత పనిమీద ద్విచక్రవాహనంలో వస్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న ఎక్స్‌కవేటర్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో రహంతుల్లా తీవ్రంగా గాయపడగా స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతి చెం1దాడని నిర్ధారించారు.. మదనపల్లె తాలూకా పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహాశివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం



విద్యుత్ కాంతులతో తంబళ్లపల్లె మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయం

పీటీఎంలోని సంగమేశ్వర ఆలయంలో వెలసిన సంగమేశ్వరుడు



మదనపల్లె అర్బన్/తంబళ్లపల్లె, మార్చి 7: మహాశివరాత్రి వేడుకలకు శైవక్షేత్రాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యుత్ కాంతుల శోభతో శైవక్షేత్రాలు శోభిల్లుతున్నాయి. మదనపల్లె, తంబళ్లపల్లె పీలేరు నియోజకవర్గాలతోపాటు ప్రతి గ్రామంలోనూ మహాశిరాత్రి వేడుకలకు ఆలయ కమిటీలు, నిర్వాహకులు భక్తుల కోసం చలువ పందిళ్ల ఏర్పాటు తోపాటు సకల సౌకర్యాలు కల్పించారు. మదనపల్లె పట్టణంలోని సోమేశ్వరాలయం, మంజునాథస్వామి , వరసిద్ధి వినాయకస్వామి , నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరీ సర్కిల్‌లోని నీలకంఠేశ్వరస్వామి, చిప్పిలిలోని యోగభోగేశ్వరస్వామి ఆలయాల్లోస్వామి ఆలయాల్లో భక్తుల దర్శనానికి ప్రత్యేకంగా బారికేట్లు, సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. చిప్పిలి యోగభోగ్వేరస్వామి ఆలయంలో మదనపల్లె మాజీ జడ్పీటీసీ నాదేళ్ల ద్వారకనాథ్ దంపతులు వస్త్రాలను ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వేశ్వరప్రసాద్‌కు అందజేశారు. నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో సనా డాన్స్ అకాడమి ఆధ్వర్యంలో రాత్రి శాస్త్రీయ నృత్య ప్రదర్శన, సంగీత కచేరి ఏర్పాటు చేసినట్లు ఆలయధర్మకర్త గుడిరామాంజులు పేర్కొన్నారు. 9న దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆల యంలో గురుస్వాములు రాజన్న , సోముశేఖర్, డంకనాచారి వారి శిష్యబృందంతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కాగా తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండ మల్లిఖార్జున స్వామి ఆలయం మహశివరాత్రి శోభ సంతరించుకుంది. రెండు రోజులుగా మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల సంధర్బంగా మల్లయ్యకొండ ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని కొండకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈవో రమణ, చైర్మన్ కేఆర్ మల్‌రెడ్డిలు తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం నుంచి శివమాల పీఠాధిపతి చింతిర్ల మల్లికార్జునస్వామి శిష్యులైన శివస్వామి, పూజారి వెంకట్రమణ శివ స్వాములచే స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివమాల భక్తులు భక్తిశ్రద్ధలతో మల్లయ్యకొండ చేరుకొని ఇరుముడులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శివమాల భక్తులు చేసే శివన్నామస్మరణాలతో మల్లయ్యకొండ మారుమ్రోగింది. వేమారెడ్డిగారిపల్లె వద్ద ఏటిగడ్డ శివాలయంలో వెలసిన మల్లిఖార్జునస్వామిని గ్రామస్థులు చాందిని బండిపై అలంకరించి గ్రామం నుంచి చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలంగా తంబళ్లపల్లె పట్టణం వరకూ ఊరేగించారు. బ్రహ్మోత్సవాల్లో బాగంగా శుక్రవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేకాభిషేకములు, సహస్రనామార్చన, సాయంత్రం 6 గంటలకు కల్యాణోత్సవం రాత్రి 12 నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు స్వామి వారి మెరవణి, 9న ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాలకు భారీ బందోబస్తు

మల్లయ్యకొండ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా డీఎస్పీ ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక సీఐ, ఆరు మంది ఎస్ఐలు, 60 మంది కానిస్టేబుళ్లు, 8 మంది స్పెషల్ పార్టీ సిబ్బందిచే బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. కొండ నుంచి వచ్చే వాహనాలను అక్కమ్మ చెరువు కట్టపై గుండా దారి మళ్లించినట్లు తెలిపారు.

మల్లయ్యకొండ పైకి 40 ఆర్టీసీ బస్సులు

మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం తంబళ్లపల్లె మల్లయ్యకొండ కింద నుంచి పైకి 40 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు మదనపల్లె వన్‌డిపో మేనేజరు వెంకట్రమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి మల్లయ్యకొండ కిందకు 18 బస్సులు, ములకలచెరువు, బికొత్తకోట, పెద్దమండ్యం నుంచి మల్లయ్యకొండ కిందకు 2 బస్సులు చొప్పున నడుపుతున్నట్లు తెలిపారు. మల్లయ్యకొండ కింద నుంచి కొండ పైకి తిరుమల నుంచి తీసుకొచ్చిన 40 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. కొండపైకి 8న తెల్లవారుజాము 3 గంటల నుంచి 9వ తేదీ మధ్యాహ్నం వరకు నడుపనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న మల్లయ్యకొండ ఆలయ అలంకరణ

తంబళ్లపల్లె, మార్చి 7: తంబళ్లపల్లె మల్లయ్యకొండ మల్లికార్జున స్వామి ఆలయంలో గోపిదిన్నె చెరువు ముందరపల్లెకు చెందిన పారిశ్రామికవేత్త నల్లగుండ్ల మల్లికార్జునరెడ్డి ఆలయం లోపల, వెలుపల రూ.2.6 లక్షలు వెచ్చించి రకరకాల పండ్లు, పత్రాలతో ప్రత్యేకంగా అలంకరణ చేయించారు. ఆలయంలోకి వెళ్లిన భక్తులకు ఈ అలంకరణ విశేషంగా ఆకట్టుకుంటోంది. కాగా, గత ఏడాది శివరాత్రి ఉత్సవాలకు కుడా మల్లికార్జునరెడ్డి ఆలయాన్ని ప్రత్యేక అలంక రణ చేయించారు.

సంగమేశ్వర ఆలయంలో శివరాత్రి వేడుకలు

పెద్దతిప్పసముద్రం మార్చి 7 : మండలంలోని టి.సదుం సమీపంలోగల పాపాఘ్నీ నది ఒడ్డున వెలసిన పరశురామ ప్రతిష్ఠిత సంగమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు గురువారం నుంచి అంకురార్పణ జరిగింది. సాయంత్రం ధ్వజారోహణంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శుక్రవారం మహాశివరాత్కిరని పురష్కరించు కుని ఉదయం స్వామి వారికి మహారుద్రాభిషేకం, రాత్రికి స్వామి వారికి కల్యాణోత్సవం, గ్రామోత్సవం. శనివారం మధ్యాహ్నం 12-33 గంటలకు స్వామివారి రథోత్సవం ఉంటుందన్నారు. ఈనెల 12 వరకు పూజలు ఉంటాయని ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. రంగసముద్రంలో వెలసిన ప్రసన్న పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రిని పురష్కరించుకుని రాత్రి 7 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తారన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలి

● మదనపల్లె టీడీపీ నేత మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, మార్చి 7: రాష్ట్ర ప్రజల ఆస్తులను తాకట్టు పెట్టేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని మదనపల్లె టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా షాజహాన్‌బాషా మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని ఐపీపెట్టే స్థాయికి దిగజార్చారన్నారు. ఐదున్నర కోట్ల ప్రజలపై రూ.12లక్షల కోట్లు అప్పు పెట్టారన్నారు. ఒక్కో తలపై రూ.2కోట్ల అప్పు పెట్టేశారన్నారు. హౌసింగ్ పథకంలో ఒక సెంటులో ఇళ్లు కట్టుకోవాలని చెబుతున్నారన్నారు. సీఎం, ఎంపీలు, ఎమ్మెల్యేలకు చాలెంజ్ విసురుతున్న ఒక్క సెంటు స్థలంలో కట్టిన ఇంటిలో మీరు కాపురం చేస్తారా? అని ఆయన సవాల్ విసిరారు. అభివృద్ధి జరగాలంటే చంద్ర బాబు, పవన్‌కళ్యాణ్‌ల ఉమ్మడి పాలన రావాలన్నారు. రాష్ట్రంలో తక్షణం సీఎం ప్రభు త్వాన్ని బర్తరఫ్ చేసి, రాష్ట్రపతి పాలన తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, బాలుస్వామి, గౌతమ్, శివన్న, షంషీర్, నాగూర్‌వలి, నాగయ్య, జీవీ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజ్యాధికారం కల్పించిన పార్టీ టీడీపీ

● వైసీపీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలకూ గౌరవం లేదు

● పీలేరులో టీడీపీ బీసీ నాయకులు



పీలేరులో విలేఖరులతో మాట్లాడుతున్న టీడీపీ బీసీ నాయకులు

పీలేరు, మార్చి 7: అనాదిగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు రాజ్యాధికారం కల్పించి వారికి గౌరవం ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీనే అని పీలేరుకు చెందిన బీసీ నాయకులు తెలిపారు. రాష్ట్రంలోని బీసీల అభివృద్ధి కోసం బీసీ డిక్లరేషన్ తీసుకువచ్చిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకు కృతజ్ఞతగా గురువారం వారు పీలేరు టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కార్యదర్శి పురం రామ్మూర్తి మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ తరువాత వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందని, అందుకనే వారు దానిని తప్పుపడుతూ అనేక దుర్మార్గమైన ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని బీసీలు వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి మద్దతిచ్చేందుకు మానసికంగా సిద్ధంగా ఉన్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వసంతాల రాజా, గాండ్ల విజయ్ కుమార్, హనీఫ్, రెడ్డిముని, అబ్బు, కొప్పూరు హరి, అబ్బవరం శ్రీనివాసులు, క్రాంతి, అంజి, శంకర, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్ చారిత్రాత్మకం

కలికిరి, మార్చి 7: టీడీపీ-జనసేన పార్టీలు సంయుక్తంగా ప్రకటించిన ఉమ్మడి బీసీ డిక్లరేషన్ చరిత్రాత్మకమైందని రాజంపేట పార్లమెంటు టీడీపీ ఉపాధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ ప్రశంసించారు. బీసీల కోసం ప్రకటించిన వరాల జల్లు సర్వత్రా ఆమోదయోగ్యమైనవని చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలు ఆ పార్టీకు వెన్నుదన్నుగా నిలిచారని గుర్తు చేశారు. ఐదేళ్ళుగా వైసీపీ ప్రభుత్వం బీసీలను చిన్న చూపు చూడటంతో సరిపోయిందన్నారు. ఉమ్మడి డిక్లరేషన్‌తో బీసీలు జవసత్వాలు పుంజుకోగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎం జగన్ పిచ్చి పరాకాష్టకు చేరింది : టీడీపీ



కూరపర్తి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన పార్టీల నాయకులు

వాల్మీకిపురం, మార్చి 7: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం విషయాలను మభ్య పెట్టి మాయ మాటలతో చేస్తున్న సీఎం జగన్ పిచ్చి పరాకాష్టకు చేరిందని వాల్మీకిపురం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి ధ్వజమెత్తారు. గురువారం మండలంలోని కూరపర్తి గ్రామంలో టీడీపీ, జనసేన పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఇరు పార్టీల ఉమ్మడి మేనిఫెస్టోతో రూపొందించిన కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేస్తూ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని చింతపర్తి గ్రామంలో కూడా సర్పంచ్ మహిత శేషాద్రిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వల్లిగట్ల వెంకటరమణ, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షు డు వెంకటరమణ, పీలేరు నియోజకవర్గ టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు లం కిపల్లె మధు, టీడీపీ పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ బాషా, నాయకులు రాజేంద్రా చారి, కోసూరి రమేష్, నాయకులు పీవీ నారాయణ, చంద్రమౌళి, తెలుగు యువత చాను, కువైట్ సయ్యద్‌బాషా, డిష్ బ్రదర్స్, అడ్వకేట్ రమణ, స్వర్ణలత, పాల్గొన్నారు.

కేవీ పల్లె నుంచి 35 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరుతున్న బండవడ్డెపల్లె, నక్కలదిన్నె వడ్డెపల్లెవాసులు

కలికిరి, మార్చి 7: కేవీపల్లె పంచా యతీలోని నక్కలదిన్నె వడ్డెపల్లె, బండవడ్డెపల్లెకు చెందిన 35 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. గురు వారం నగరిపల్లెలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో వారంతా పసుపు కండువాలు కప్పుకుని టీడీపీలో చేరారు. రాబోయే ఎన్నికల్లో మండలం లో టీడీపీకి భారీ మెజారిటీ వచ్చేందుకు కృషి చేయాలని కిశోర్‌కుమార్ రెడ్డి కోరారు. స్థానిక టీడీపీ నాయకులు కుప్పం రవిచంద్రారెడ్డి, ఆర్. రెడ్డెప్పరెడ్డి, యర్రం రెడ్డి, సుధాకర్ నాయుడు, వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో వారంతా టీడీపీలో చేరారు.

గుర్రంకొండలో:టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గుర్రంకొండ పట్టణానికి చెందిన నక్కా సిద్దయ్య కుటుంబ సభ్యులైన నక్కా రాజు, కుమార్, సతీష్‌పాటు పలువురు టీడీపీలో చేరారు. ఇందులో భాగంగా నల్లారి స్వగృహంలో శుక్రవారం ఆయనను కలిసి పార్టీలో చేరగా వారికి కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుర్రంకొండ నాయకులు నౌషాద్‌అహ్మద్, ఏజాజ్ అహ్మద్, మౌలా, హేస్సాన్, రమణలు పాల్గొన్నారు.

టి.సదుంలో జయచంద్రారెడ్డి కారుపై దాడి

పెద్దతిప్పసముద్రం మార్చి 7 : తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి దాసిరిపల్లె జయచంద్రారెడ్డి కారుపై టి.సదుంలో రాళ్ల దాడి జరిగింది. తంబళ్లపల్లె నియోజకవర్గ పర్యటనలో భాగంగా జయచంద్రారెడ్డి గురువారం ఉదయం పీటీఎం మండలం టి.సదుం పంచాయతీకి వెళ్లి కార్యకర్తలను కలిసి తమకు మద్దతు తెలపాలని కోరారు. ఈ క్రమంలో జయచంద్రారెడ్డి కారుపై ఉన్నట్టుండి రాళ్లదాడి జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు చేసిన ఈ సంఘటనలో కారుకు ముందు వైపు ఉన్న అద్దం పాక్షికంగా దెబ్బతింది. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే టీడీపీ నాయకుడు శంకర్‌యాదవ్ స్వగ్రామంలోనే ఈ సంఘటన జరగడంతో నియోజకవర్గమంతా చర్చనీయాంశంగా మారింది. విషయం తెలుసుకున్న పీటీఎం ఎస్ఐ రవీంద్రబాబు సంఘటన స్థలానికి చేరుకుని జయచంద్రారెడ్డితో మాట్లాడారు. ఇది ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పనేనని ఆయన సున్నితంగా తిరస్కరించారు.

మహిళా నాయకురాలిని అవమానపరచడం దారుణం

నిమ్మనపల్లి, మార్చి 7: అనంతపురం జిల్లా గుంతకల్ పావిడిపట్టణంలో జరిగిన మహిళా సాధికారత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఒక మహిళా నాయకురాలిని కించపరచి అవమానకరంగా మాట్లాడడం హేయమైన చర్య అని వాల్మీకిబోయ సాధికారత సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మన్న పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గుంతకల్ పావిడిపట్టణంలో చెక్కుల పంపిణీకి హాజరైన ఏసీసీ బ్యాంక్ చైర్మన్ నిఖిత కుటుంబాన్ని కించపరిచే విధంగా మాట్లాడి అవమానపరిచిన వైసీపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వెంటనే లిఖిత కుటుంబానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. బోయలు తలుచుకొంటే వైసీసీలో టికెట్ కూడా రాదని హెచ్చరించారు. బీసీలు అందరూ కలసి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని ఓడిస్తామని తెలిపారు.

బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

కలకడ, మార్చి 7:బాలింతల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని వైద్యాధికారి డాక్టర్ జవహర్ బాబు సిబ్బందికి సూచించారు. గురువారం ఆశా డే సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గర్భవతులకు అంగన్‌వాడీల ద్వారా అందే పౌష్టికాహారం తప్పక తీసుకోవాలన్నారు ప్రజలు వేసవిలో వడదెబ్బ భారీన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చిన్నారికి గాయాలు

మదనపల్లె టౌన్, మార్చి 7: తల్లిదండ్రుల ఏమరిపాటుతో ఓ చిన్నారి విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. పుంగనూరు బోరింగ్ వీధికి చెందిన చిన్నారెడ్డి, కస్తూరి దంపతులకు లోహిత్(5) అనే కుమారుడు వున్నాడు. గురువారం బాత్రూమ్‌లో బకెట్లో నీళ్ల పోసి అందులో హీటర్ వేసిన చిన్నారెడ్డి బయటకు వెళుతూ హీటర్ ఆఫ్ చేయాలని భార్యకు చెప్పాడు. ఆమె పనుల మీద వుండటంతో మర్చిపోయింది. ఈ క్రమంలో వారి కుమారుడు లోహిత్ బాత్రూమ్‌లోకి వెళ్లి హీటర్‌ను పట్టుకోవడంతో చేతులు రెండు కాలిపోయాయి. గమనించిన తల్లిదండ్రులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

సబ్ స్టేషన్ల నిర్మాణాలకు స్థల పరిశీలన

పెద్దతిప్పసముద్రం, మార్చి 7: మండలంలో నూతనంగా చేపట్టే విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాలకు స్థల పరిశీలన కోసం రెవెన్యూ అధికారులతో కలసి గురువారం ట్రాన్స్‌కో ఏఈ ఉత్తన్న మండలంలోని బొంతలవారిపల్లె, అనంతాపురం సమీపంలో స్థలాన్ని పరిశీలించారు. ముందుగా బొంతలవారిపల్లె సమీపంలోని సర్వే నంబర్ 442లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి ఆ భూమిన ట్రాన్స్‌కో అధికారులకు చూపించారు. అనంతాపురం సమీపంలో సర్వే నంబర్ 31/8 లో భూమిని చూపించి హద్దులు కేటా యించారు. కార్యక్రమంలో ఆర్ఐ అనిషా, వీఆర్వోలు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.7లక్షలు ఆదాయం

నిమ్మనపల్లి, మార్చి 7: స్థానిక పంచాయతీకి వారపు సంత వేలం ద్వారా రూ. 7లక్షలు ఆదాయం చేకూరినట్లు డీఎల్‌పీవో నాగరాజ తెలిపారు. గురువారం స్థానిక వారపు సంత వద్ద ఏడాదికి సంబందించి బస్టాండు గేటు, వారపు సంతను వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో సోమశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి అత్యధికంగా వారపు సంతను రూ.7లక్షలకు దక్కించుకొన్నట్లు తెలిపారు. అనంతరం బస్టాండు గేటుకు వేలం పాట నిర్వహించేందుకు డిపాజిట్ దారుల ముందుకు రాకపోవడంతో వాయిదా పడింది. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ చలపతి రావు, సర్పంచ్ పాపులమ్మ, కార్యదర్శులు వెంకటరమణ, రాజేశ్, మల్లప్ప, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు ఉద్యోగాలు ఇప్పించండి

మదనపల్లె టౌన్, మార్చి 7: మదనపల్లె బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్హులైన వారికి ఉద్యోగాలు ఇప్పిం చాలంటూ బీటీ కళాశాలలో పని చేసిన ఆరుగురు కంటింజెంట్ వర్కర్స్, బీఎస్‌వై అధ్యక్షుడు పునీత్ రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్‌కు విన్నవించారు. గురువారం వెలగపూడిలోని హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్‌ను కలసిన బీఎస్‌వై అధ్యక్షుడు పునీత్ మాట్లాడుతూ గత నెల 6న వచ్చిన ప్రొసీడింగ్స్ ప్రకారం అర్హులైన ఆరుగురికి న్యాయం జరగలేదని, అనర్హులకే జీతాలు కేటాయిస్తూ ప్రొసీడింగ్ ఇచ్చారన్నారు. దీనిపై పునః విచారించి పేదలకు న్యాయం చేస్తూ, అనర్హులను ఉద్యోగాల నుంచి తొలగించాలని కోరారు.

శ్మశాన వాటికల ఏర్పాటు పట్టించుకోండి

పీలేరు, మార్చి 7: దళితవాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటు గురించి పట్టించుకోవాలని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తుమ్మల ధరణీకుమార్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని దళితవాడల్లో 45 రోజుల్లోగా శ్మశాన వాటికల కోసం స్థలాలను గుర్తించి ఆయా పంచాయతీలకు అప్పగించాలని సీసీఎల్ఏ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్‌లకు ఆదేశాలు అందినా అవి ఇంత వరకు ఆచరణకు నోచుకోలేదన్నారు.

హిందు శ్మశాన వాటిక ప్రారంభం

మదనపల్లె, మార్చి 7: మదనపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన హిందూశ్మశాన వాటిక అందుబాటులోకి వచ్చింది. స్థానిక పెద్దతోపులో ఇదివరకే ఉన్న హిందూ శ్మశాన వాటిక ఆవరణంలో మున్సిపాలిటీలోని బీపీఎస్ పథకం నిధులు రూ.1.37కోట్లు వెచ్చించి నూతనంగా ఏర్పాటు చేశారు. గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ చేతులు మీదుగా ప్రారంభించారు.

మయూర వాహనంపై సిద్దేశ్వరుడి విహారం

కలకడ, ఫిబ్రవరి 7:స్థానిక సత్యవతి నది తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మయూర వాహనంపై బలిజ కులస్థుల ఆధ్వర్యంలో ఊరేగించారు. భక్తులకు నిర్వాహకులు వెంకటరమణ, రెడ్డిశేఖర్, శ్రీనివాసరావు, మునస్వామి, జగదీష్, శ్రీరాములు, శంకర, లక్ష్మీనారాయణ, రమణ, ఎద్దుల సుందరయ్య అన్నదానం నిర్వహించారు.

ఘనంగా టీడీపీ నేత జన్మదిన వేడుకలు

మదనపల్లె టౌన్, మార్చి 7: రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ జన్మదిన వేడుకలను ఆయన అనుచరులు ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు ఆధ్వర్యంలో ఆర్‌జే వెంకటేశ్ కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కాగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్‌కు ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వంటికొండ వెంకటేశ్, గండికోట గణేష్, ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు పత్రాలు అందజేత

మదనపల్లె, మార్చి 7: పట్టణంలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇంటి తాళాలు అందజేశారు. మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారికి ఆనుకుని వెంకప్పకోట వద్ద జీప్లస్ 3 నమూనాలో నిర్మించిన ఇళ్లను గురువారం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ రిజిస్ట్రేషన్ అయిన పత్రాలు, ఇంటి తాళాలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ చైర్‌పర్సన్ జి.షమీంఅస్లాం, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్‌అజాం, జడ్పీటీసీసభ్యుడు డి.ఉదయ్‌కుమార్, కురబలసంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, స్థానిక సర్పంచి సిద్దల దీపా, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, కౌన్సిలర్లు బి.ఎ.ఖాజా, ప్రసాద్‌బాబు, చంద్రశేఖర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మదనపల్లె టౌన్, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివలింగయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక రవాణాశాఖ కార్యాలయంలో 20 మంది మహిళలకు డ్రైవింగ్ లైసెన్సులు మంజూరు చేశారు. అనంతరం మహిళలందరికి ముందస్తుగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి విద్యార్థినులకు, మహిళా అధ్యాపకులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అలాగే స్థానిక శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రమాదేవి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.

బి.కొత్తకోటలో: నగరపంచాయతీ పరిధిలోని ఐసీడీయస్ ప్రాజెక్టు కార్యలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రాజెక్టు ఆఫీసర్ భాగ్యమ్మ పర్యవేక్షణలో, సూపర్‌వైజర్లు జయరాణి, హిజాద్‌ప్యారీ, భవాని,గౌరీదేవిల ఆధ్వర్యంలో తహశీల్దార్ పుణ్యవతిని ఘనంగా సత్కరించారు.

పీలేరులో: పీలేరులో గురువారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్ని ఘనంగా జరుపుకున్నారు. పీలేరు మం డలం తలపుల పీహెచ్‌సీలో వైద్యాధికారి రమేశ్ రెడ్డి మహిళా సిబ్బం దికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. వారితో కేక్ కట్ చేయించి అందరికీ పంచి పెట్టారు.

మదనపల్లెలో శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్



మదనపల్లె టౌన్, మార్చి 7 : శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ గురువారం రాత్రి మదనపల్లెలోని మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా షరీఫ్‌ను పలువురు నాయకులు కలిశారు. మదనపల్లెలో టీడీపీ బలం, పార్టీ స్థితిగతుల గురించి షరీఫ్ పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. షరీఫ్‌ను కలిసిన వారిలో టీడీపీ మైనార్టీ సెల్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్, రాటకొండ మధుబాబు, బాలుస్వామి, నాదెళ్ల శివన్న తదితరులు ఉన్నారు.